ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 28.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 8 పేజీలు: 12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

నేటి నుంచి ఐపీఎల్ 12

వైభవంగా భద్రాద్రి రాముడి కల్యాణోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్న సీఎం రేవంత్
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు
- రూ.351కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి
- నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన సీఎం
- రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, భద్రాచలం

మార్చి 27 : భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సీతా సమేత శ్రీరామచంద్రుడి కల్యాణాన్ని మిథిలా మైదానంలో అభిజిత్ లగ్నంలో అట్టహాసంగా నిర్వహించారు. సీతమ్మ తల్లిని శ్రీరాముడు మనువాడే అద్భుత ఘడియల కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న రామభక్తులు ఈ లోకకల్యాణాన్ని కనులారా తిలకించి తరించారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో

...:: మిగతా 3లో

యుద్ధం వల్ల తీవ్ర పరిస్థితులు

నిరంతర పర్యవేక్షణ, వ్యూహాలు అవసరం

- సమన్వయ స్ఫూర్తి భారత్‌కు అతిపెద్ద బలం
- విద్రోహ శక్తులు భద్రతకు విఘాతం కలిగించే ప్రమాదం
- భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచన
- తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు
- సీఎంలతో వర్చువల్‌గా ప్రధాని ఉన్నత స్థాయి సమీక్ష
- పశ్చిమాసియా యుద్ధ పరిణామాలపై చర్చ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 27: పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తలెత్తిన పరిస్థితి తీవ్రంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. నిరంతర పర్యవేక్షణ, వ్యూహాలు అవలంబించడం అవసరమని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మోదీ నిర్దేశించారు. ఎన్నికలు

...:: మిగతా 2లో

సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

- రాష్ట్రంలో కమిటీల ఏర్పాటు..
- నోడల్ ఆఫీసర్ల నియామకం
- పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు
- ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం
- పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

...:: 2లో

ఏప్రిల్ 25న రాజకీయ పార్టీ ప్రకటిస్తాం

తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతోంది మునీరాబాద్ వేదికగా పార్టీ జెండా, అజెండాను ప్రకటిస్తాం

- తెలంగాణ భవిష్యత్ మార్చే దారి దీపం కాబోతున్నాం
- సర్వోదయ తెలంగాణ కావాలన్నదే లక్ష్యం
- మేము ఎవరికీ బీ టీమ్ కాదు... రాష్ట్రలో మాదే నంబర్ వన్ పార్టీ
- మా అజెండా ప్రజల ఆమోదం పొందేలా ఉంటుంది
- ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చేదాకా వదిలిపెట్టను
- ఢిల్లీలో లాబీయింగ్ చేయగలను.. గల్లీలో కష్టపడగలను
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్

మార్చి 27: తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చబోతున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఏప్రిల్ 25న మేడ్చల్లోని మునీరాబాద్ వేదికగా పార్టీ ఆవిర్భవ సభ ఉంటుందన్నారు. అదే రోజు పార్టీ జెండా, అజెండా ప్రకటిస్తామని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా తన మెట్టినిల్లు నిజామాబాద్ నుంచి కవిత ఈ ప్రకటన చేశారు. తెలంగాణ భవిష్యత్ ను మార్చే దారి దీపంలా జాగృతి పార్టీ ఉంటుందన్నారు. సర్వోదయ తెలంగాణ కోసం తాము పనిచేస్తాని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి యే మన రాష్ట్ర ప్రాంతీయ పార్టీగా, ప్రతి ఒక్కరి ఇంటి పార్టీగా ఉంటుందన్నారు. తమ పార్టీ ఎవరికీ బీ టీమ్ కాదని, తమదే తెలంగాణలో నంబర్ వన్ పార్టీ అవుతుందని చెప్పారు. కుల, మత, వర్గాలకు అతీతంగా సర్వ జనుల కోసం, సర్వోదయ తెలంగాణ కోసం తమ పార్టీ పనిచేస్తుందన్నారు. తమ అజెండా ప్రాక్టికల్ గా, ప్రజల ఆమోదం పొందే విధంగా ఉంటుందన్నారు. ఇప్పటికే 50 కమిటీలు వేయటంతో పాటు

...:: మిగతా 2లో

రత్నాకర్ బ్యాంక్‌లో ఘరానా మోసం

రూ. 138 కోట్ల గోల్‌మాల్

- బ్యాంక్ మేనేజర్ సహా.. 13 మంది అరెస్ట్
- కరీంనగర్ పోలీసుల 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' ఎఫెక్ట్
- భారీ సైబర్ ముఠా గుట్టు రట్టు

...:: 6లో

ఇరాన్‌కు మరో 10 రోజులు గడువు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

- డిమాండ్లు నెరవేరుస్తామంటేనే యుద్ధ విరమణ: ఇరాన్
- ఇరాన్‌తో చర్చల్లో పురోగతి: ట్రంప్
- అసలు చర్చలే జరగడం లేదు: ఇరాన్
- ఇరాన్‌పై దాడులు ఇక ఉధృతం: ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్‌సైనిక స్థావరాలను లక్ష్యంగా ఇరాన్ దాడులు ముమ్మరం
- అమెరికాను ఢీ కొట్టేందుకు ఇరాన్ 10 లక్షల సైన్యం

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరో పది రోజుల గడువు ఇచ్చారు. యుద్ధ విరమణకు అమెరికా ప్రతిపాదించిన 15 షరతులను ఇరాన్ తిరస్కరించినప్పటికీ, హార్ముజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని విద్యుత్ వ్యవస్థలను నాశనం చేస్తామంటూ గతంలో ఇచ్చిన డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించారు. గతంలో తాను ఇచ్చిన 48 గంటల డెడ్‌లైన్‌ను ఉపసంహరించి ఇరాన్‌కు మరో ఐదు రోజులు గడువిస్తున్నట్టు ఈ నెల 23న ట్రంప్ ప్రకటించారు. అయితే దానికి స్పందన లేకపోవడంతో మరోసారి తన గడువు పొడిగించారు. ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తామని ఏప్రిల్ 6వ తేదీ 8 పీఎం వరకు దానికి డెడ్‌లైన్ విధిస్తున్నట్టు గురువారం ప్రకటించారు.

డిమాండ్లు నెరవేరుస్తామంటేనే యుద్ధ విరమణ

ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన 15 షరతులను ఇరాన్

...:: మిగతా 2లో

'లాక్ డౌన్' విధించే ప్రసక్తే లేదు

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌లో లాక్‌డౌన్ విధించబోతున్నారనే వదంతులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కొట్టిపారేశారు.

11

విరిగిపడిన మంచు కొండలు ఏడుగురు మృతి

జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ – లేహ్ మార్గంలో హిమపాతం విధ్వంసం సృష్టించింది. మంచు కొండలు విరిగి పడిన ఘటనలో ఏడుగురు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. పన్నెండకు పైగా కార్లు మంచులో కూరుకుపోయాయి.

11

2.38 లక్షల కోట్లతో యుద్ధ విమానాల కొనుగోలు

భారతదేశం రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకొనే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా సైనిక అవసరాల కోసం భారీగా యుద్ధ విమానాల కొనుగోలుకు డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

11



పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ భారీగా తగ్గింపు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ.3 తగ్గించగా.. డీజిల్‌పై పూర్తిగా (జీరో) రద్దు చేసింది.

11

రాష్ట్రీయం

సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

- రాష్ట్రంలో కమిటీల ఏర్పాటు..
- నోడల్ ఆఫీసర్ల నియామకం
- పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు
- ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం
- పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 27 : పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు, బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రతి బంక్‌లో స్టాక్ ఎంత ఉంది, ఎంత వినియోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు.

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం

తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు సీఎం రేవంత్ పీఎం మోడీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకు పైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి పాల్గొన్నారు.

యుద్ధం వల్ల తీవ్ర పరిస్థితులు

మొదటిపేజీ తరువాయి

జరగనున్న రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల సీఎంలతో వర్చువల్‌గా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన మోదీ యుద్ధ పరిణామాలపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడంలో సహకారం, సమన్వయ స్ఫూర్తి భారత్‌కు అతిపెద్ద బలమని వివరించారు. గతంలో సరఫరా, వాణిజ్యంపై కోవిడ్ విపత్తు ప్రభావాన్ని తగ్గించడానికి కేంద్రం, రాష్ట్రాలు టీమిండియాగా కలిసి పనిచేయడాన్ని గుర్తుచేశారు. సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని విద్రోహ శక్తులు భద్రతకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని, భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేవారు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థిక, వాణిజ్య స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్న మోదీ, పౌరుల ప్రయోజనాలను పరిరక్షించడం ముఖ్యమని తెలిపారు. పరిశ్రమలు, సరఫరా గొలుసుల వ్యవస్థ బలోపేతం చేయాలనీ, సాగు రంగం, ఎరువుల నిల్వ, పంపిణీ పర్యవేక్షణలో ప్రణాళిక అవసరమని అప్రమత్తం చేశారు. వేగంగా స్పందించేందుకు అన్ని స్థాయిల్లో యంత్రాంగాలు ఏర్పాటు చేయాలన్నారు. నౌకాయానం, నిత్యావసరాల సరఫరా, సవాళ్ల పరిష్కారంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంధనంపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలని కేంద్రం తీసకున్న నిర్ణయాన్ని సీఎంలు స్వాగతించారు. రాష్ట్రాలకు వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపుల పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ తగినంత ఉండటంతో పరిస్థితి స్థిరంగా ఉందని ప్రధాని దృష్టికి ముఖ్యమంత్రులు తీసుకెళ్లారు. కేంద్రంతో సమన్వయంతో పనిచేయడానికి సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా సైతం పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌కు దూరంగా ఎన్నికలు జరిగే రాష్ట్రాల సీఎంలు

అయితే, తమిళనాడు, బంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఆయా రాష్ట్రాల సీఎంలకు బదులు సీఎస్‌లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఉద్రిక్తతల ప్రారంభమైన తర్వాత ముఖ్యమంత్రులతో సమావేశం కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు సహా పలువురు ముఖ్యమంత్రు, సీఎస్‌లు పాల్గొన్నారు.

రాజ్‌నాథ్ నేతృత్వంలో మంత్రుల బృందం ఏర్పాటు

మరోవైపు పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అనధికారిక మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కీలక బృందంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పురి సభ్యులుగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. ఫలితంగా అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పౌరుల జీవితాలపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను పర్యవేక్షించేందుకు, తగిన చర్యలు తీసుకునేందుకు ఈ ప్రత్యేక మంత్రుల బృందం పనిచేయనుంది.

ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో
రూ. 26 కోట్ల మోసం

- హైటెక్ సైబర్ ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు
- నలుగురు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

ప్రతిపక్షం, సిటీబ్యూరో, మార్చి 27: ఆన్‌లైన్‌లో గేమింగ్ పేరుతో రూ.26 కోట్లకు పైగా కొల్లగొట్టిన హైటెక్ సైబర్ ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. వేర్వేరు రాష్ట్రాల్లో ఉంటూ కార్యకలాపాలు నిర్వహించే ముఠాలోని నలుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సైబర్‌క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు తెలిపిన ప్రకారం హైదరాబాద్‌లోని పద్మారావునగర్‌కు చెందిన రాజేశ్ వెంకటరామన్ (48), గుజరాత్‌కు చెందిన రిషభ్ జశ్వంత్‌రాయ్ గాంధీ, ఉప్పల్‌కు చెందిన భమిడిపాటి అభిషేక్ (27), గోవాకు చెందిన వెబ్ డిజైనర్ మన్మీత్ శర్మ (40), కేరళలోని ఎర్నాకుళం ప్రాంతవాసి, ప్రస్తుతం నల్గొండలో ఉంటున్న అగస్టీన్ విలియమ్స్ (38) కలిసి డబ్బు కొట్టేసేందుకు ప్లాన్ చేశారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్ల ద్వారా డబ్బు కాజేసేందుకు వైవన్ గేమ్ పేరుతో ఉన్న నకిలీ గేమింగ్ వెబ్‌సైట్‌ను సృష్టించారు. ఎవరైనా ఈ వెబ్‌సైట్‌ను నిజమని నమ్మి డబ్బు చెల్లించి గేమ్స్ ఆడితే భారీగా లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా చూపించేవారు. కానీ వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తే నిరాకరించేవారు. వీరికి దిల్లీకి చెందిన ఆండీ అలియాస్ సమీర్ సహకరించేవాడు. ఇలా ఫేక్ కంపెనీల పేరుతో కేవైసీ సృష్టించి బ్యాంకు అకౌంట్స్ తెరిచేవాడు. ఆ ఖాతాల వివరాలను మాత్రం గోవాలో ఉండే మన్మీత్‌శర్మ, ఉప్పల్‌కు చెందిన భమిడిపాటి అభిషేక్ గుజరాత్‌లోని సూర్యోదయ బ్యాంకు అధికారులకు పంపి పేమెంట్ గేట్‌వే సేవలు పొందేవారు. ఒకవేళ బాధితులు గేమ్స్ ఆడి పోగొట్టుకున్న డబ్బు మొత్తం ఈ పేమెంట్ గేట్‌వేల ద్వారానే వివిధ అకౌంట్లో జమయ్యేవి. వచ్చిన డబ్బుతో వెంకటరామన్, మన్మీత్ చెరో 5 శాతం తీసుకునేవారు. మిగతా వారు అభిషేక్, అగస్టీన్‌కు కొద్ది మొత్తంలో డబ్బు ఇచ్చి మిగిలింది ఆండీ, రిషబ్ ఖాతాకు బదిలీ చేసేవారు. ఈ తరహాలోనే ఇప్పటివరకు నిందితులు రూ.26.07 కోట్ల లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌కి చెందిన ఓ యువతి ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రకటన చూసి రూ.30 లక్షలు పోగొట్టుకున్నారు. సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా ఇన్‌స్పెక్టర్ శివచంద్ర బృందం దర్యాప్తు చేపట్టింది. వైవన్ గేమ్ వేదికలో డబ్బు పోగొట్టుకున్నట్లు పోలీసులు గుర్తించి సాంకేతిక ఆధారాలతో వెంకటరామన్, అభిషేక్, అగస్టీన్, మన్మీత్‌శర్మలను అదుపులోకి తీసుకున్నారు.

ఏప్రిల్ 25న రాజకీయ పార్టీ ప్రకటిస్తాం

మొదటిపేజీ తరువాయి

మేధావులతోనూ చర్చలు జరుపుతున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజలు కూడా కొత్తగా ఏర్పాటు చేయబోయే తమ పార్టీ ఏ విధంగా పనిచేయాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. తమ ఫోకస్ అంతా కూడా తెలంగాణ మీదనే ఉంటుందని కవిత స్పష్టం చేశారు. రాజకీయ పార్టీకి ఈగో ఉండకూదన్నారు. తనను విమర్శించిన వారైనా సరే తెలంగాణ కోసం పనిచేసే ఉద్దేశం ఉంటే కలిసి రావాలని పిలుపునిచ్చారు. తాను ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు కూడా వదిలి పెట్టనని... రాజకీయ పార్టీ ద్వారా కూడా తెలంగాణ భవిష్యత్ ను మార్చే వరకు పోరాడుతానని చెప్పారు. అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేయగలనని.. గల్లీలో కూడా కష్టపడతానని కవిత చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా ఆ శ్రీరాముడి స్ఫూర్తితో పార్టీ ప్రకటన చేస్తున్నానని అన్నారు. పాలన పై ప్రజాభిప్రాయం తీసుకొని వైఫల్యాలను మార్చుకున్న వ్యక్తి శ్రీరామ చంద్రుడని కవిత గుర్తు చేశారు. పార్టీ ఆవిర్భావ సభ నాటికి కాశీకి వెళ్లి శివుడికి అభిషేకం చేస్తామని చెప్పారు. ఆ తర్వాత పార్టీ ఆవిర్భావ సభ ఉంటుందన్నారు.

సబ్బండ వర్గాలు సభకు విచ్చేయండి

ఏప్రిల్ 25న జరిగే పార్టీ ఆవిర్భావ సభకు సబ్బండ వర్గాలు రావాలంటూ కవిత ఆహ్వానించారు. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలను సంపూర్ణంగా సాధించుకోలేకపోవటం బాధాకరమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఆ తర్వాత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కూడా ఇంకా మనం మౌలిక సదుపాయాల కోసం కూడా పోరాటం చేసే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా బస్సు ప్రమాదాలు, కుక్క కాట్లు, మక్క కొనుగోలు సెంటర్లు వంటి వాటి కోసం కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అయ్యే వరకు ఒక విధంగా ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక విధంగా ప్రవర్తించటం కొత్త రాజకీయ ఒరవడిగా మారిందన్నారు. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరముందన్నారు. ఇచ్చిన మాట అమలు చేయకపోయినా సరే ప్రజలు పట్టించుకోరన్న ధైర్యం రాజకీయ నాయకుల్లో ఉందన్నారు. ఆ విధానం పోవాలంటే ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రతిపక్షంలో ఉంటే క్రిటిసిజం, అధికారంలోకి వస్తే ఎస్కేపిజం అన్నట్లుగా రాజకీయ నాయకుల వైఖరి ఉందని విమర్శించారు. ఇలాంటి రాజకీయాల నుంచి తెలంగాణ భవిష్యత్ ను మార్చాల్సిన అవసరముందని ఆమె చెప్పారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల కోసం జాగృతి గత 20 సంవత్సరాలుగా పనిచేసిందని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రజల కోసం పనిచేసేందుకు అన్ని వర్గాల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు.

ఫలితం వచ్చే వరకు పట్టు వదలా

ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు తాను వదలనని కవిత చెప్పారు. గత 20 ఏళ్లుగా జాగృతి సంస్థ పని చేస్తుందని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక, రాకముందు, బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా తాను ప్రజల కోసం పనిచేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 350 మంది రైతులకు జాగృతి సంస్థ తరఫున నాలుగేళ్ల పాటు నెలకు రూ. 2500 పెన్షన్ ఇచ్చామని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో నిజామాబాద్, పెద్దపల్లి రైల్వే లైన్ ను మూడేళ్లలో పూర్తి చేయించానని కవిత చెప్పారు. 25 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనిని తాను చేయిస్తానని చెబితే అంతా నవ్వారని కానీ తాను ఆ పనిని పూర్తి చేశానని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే కచ్చితంగా తెలంగాణ రాజకీయాలను మార్చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుల అనుభవాన్ని రాష్ట్ర అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటామని అన్నారు. అదే విధంగా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. మన జీవితాన్ని శాసించే రాజకీయాల్లోకి ప్రతి ఒక్కరూ అడుగు పెట్టాలని కవిత కోరారు. రాజకీయాలు రాకెట్ సైన్స్ కాదని అందరూ రాజకీయాల్లోకి వచ్చి మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

ప్రతిపక్షం
ఏప్రిల్ 25న కవిత పార్టీ ప్రకటన

ముందుగానే వెలుగులోకి తెచ్చిన 'ప్రతిపక్షం'

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కొన్ని దినపత్రికల్లో వెలువడిన ఊహాగానాలకు బలం చేకూరుస్తూ, ఏప్రిల్ 25న కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించే అవకాశముందని , "ప్రతిపక్షం" దినపత్రిక ముందుగానే ఈ సంచలన సమాచారాన్ని ప్రచురించడం విశేషంగా నిలిచింది. తాజాగా, నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత స్వయంగా స్పందిస్తూ, ఏప్రిల్ 25న కొత్త పార్టీ ప్రకటన ఉండబోతుందని స్పష్టంగా వెల్లడించారు. దీంతో "ప్రతిపక్షం" దినపత్రిక ప్రచురించిన వార్త నిజమని తేలింది. "ప్రతిపక్షం" దినపత్రిక వార్తా సేకరణలో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించుకుంది.

దేశంలో ఎలాంటి సమస్య రాదు. ఆయిల్, గ్యాస్ కొరత లేదు. రూమర్లను నమ్మి పానిక్ కావద్దు. ప్రభుత్వాన్ని నమ్మాలి. ఏ యుద్ధంలోనూ జోక్యం చేసుకోవాలని భారత్ కోరుకోవడం లేదు. పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ డ్యూటీలను తగ్గించాం. సంక్షోభం భారాన్ని తనపై వేసుకున్న దేశం ఇండియా ఒక్కటే. ప్రపంచంలో ఇంకోటి లేదు.
- కేంద్ర మంత్రి అమిత్ షా

ఇరాన్‌కు మరో 10 రోజులు గడువు

మొదటిపేజీ తరువాయి

తిరస్కరించడమే కాక, తమ డిమాండ్లను అమెరికా ముందు ఉంచి, అవి నెరవేరుస్తానంటేనే యుద్ధ విరమణ చేస్తామని పేర్కొంది. ఈ విషయంలో ఆ దేశంతో నేరుగా ఎలాంటి చర్చలు జరపమని, దీనిపై రాజీపడబోమని స్పష్టం చేసింది. అంతేకాకుండా అమెరికా ఇజ్రాయెల్ దేశాలతో పాటు వాటి మిత్ర దేశాలకు చెందిన వాణిజ్య నౌకల రాకపోకలను హోర్ముజ్ జలసంధి మీదుగా అంగీకరించబోమని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ పునరుద్ఘాటించింది. కాగా, 'ఫేక్ న్యూస్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నప్పటికీ చర్చలు చాలా బాగా జరుగుతున్నాయి' అని ట్రంప్ తాజాగా ఓ పోస్ట్‌లో పేర్కొన్నారు.

10 లక్షల సైన్యం సిద్ధం
అమెరికాను ఢీ కొట్టేందుకు ఇరాన్ సన్నద్ధం

అమెరికా, ఇజ్రాయెల్‌తో భూతల యుద్ధం జరగవచ్చని ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో 10 లక్షల మందికి పైగా యోధులను ఇరాన్ సమీకరించినట్లు తెలిసింది. ఈ 10 లక్షల మందిలో సైనిక సిబ్బంది, వలంటీర్లు ఉన్నట్లు ఇరాన్ ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ తాస్నిం వార్తాసంస్థ తెలిపింది. సమీకరించిన ఈ దళాలు భిన్న పరిస్థితులను ఎదుర్కోగల సామర్థ్యంతో ఉన్నట్లు వర్గాలు తెలిపాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డు కోర్ (ఐఆర్‌జీసీకి చెందిన బసీజ్ (వలంటీర్ పారామిలిటరీ ఫోర్స్) నియామక కేంద్రాలు, సైన్యంలో దళాల సంఖ్య పెరిగిందని, దేశాన్ని రక్షించంలో పాలుపంచుకునేందుకు సంసిద్ధత తెలియచేస్తూ భారీ సంఖ్యలో యువ ఇరానియన్లు ముందుకు వచ్చారని వర్గాలు పేర్కొన్నాయి. ఖర్గ్ ద్వీపంలో తన బలగాలను ఇరాన్ ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున పెంచింది. అదనపు బలగాలతోపాటు గగనతల రక్షణ వ్యవస్థలు, ఆత్మరక్షణ ఉచ్చులను కూడా ద్వీపంలో ఏర్పాటు చేసింది.

ఇజ్రాయెల్‌కు సైనికుల కొరత

ఇరాన్‌తో భీకర యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్‌ను జవాన్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఆ దేశ ఆర్మీ చీఫ్ జమీర్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం జరిగిన సెక్యూరిటీ క్యాబినెట్ సమావేశంలో ఈ విషయమై ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్టు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ పేర్కొన్నది. 'మీ ముందు నేను పది ఎర్ర జెండాలు (తీవ్ర ప్రమాద పరిస్థితులు) ప్రదర్శిస్తున్నా' అని ఆయన మంత్రులకు చెప్పినట్టు చానెల్ 13 న్యూస్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్బంధ సైనిక సేవా చట్టం, రిజర్వ్ డ్యూటీ చట్టం, తప్పనిసరి సేవను పొడిగించే చట్టం అమలు కావాలని జమీర్ కోరినట్టు సమాచారం.

ఇరాన్‌పై దాడులు ఇక ఉధృతం: ఇజ్రాయెల్

యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చల్లో పురోగతి ఉందని వెల్లడిస్తూ హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్‌కు మరి కొంత వ్యవధిని ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక పక్క ప్రకటించగా ఇరాన్‌పై దాడులను తీవ్రతరం చేసి విస్తరిస్తామని మరోపక్క ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటించింది. కాగా, ఇరాన్ కూడా తగ్గే సూచనలు ఏవీ కనిపించడం లేదు. స్టాక్ మార్కెట్లు కుదేలవుతుండటం, యుద్ధం వల్ల కలిగే ఆర్థిక పరిణామాలు పశ్చిమాసియాను దాటి చాలా దూరం విస్తరించడంతో హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును సడలించాలని ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. జలసంధిపై నియంత్రణను వదులుకోవడంతోపాటు కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన 15 అంశాల ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. అమెరికా అదే సమయంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ నుంచి చేజిక్కించుకునేందుకు సైనిక చర్య కోసం వేలాది బలగాలను పశ్చిమాసియాకు పంపాలని కూడా ట్రంప్ నిర్ణయించారు. ఏప్రిల్ 6 నాటికి జలసంధిని తెరవకపోతే ఇరాన్ ఇంధన ప్లాంట్లను ధ్వంసం చేయాలని తాను ఆదేశిస్తానని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌తో చర్చల్లో మంచి పురోగతి ఉందని ట్రంప్ ప్రకటించగా అసలు సంప్రదింపులేవీ జరగడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులు

ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ శుక్రవారం దాడులు ముమ్మరం చేసింది. ఇరాన్ క్షిపణులను కూల్చివేయడమే రోజువారీ పనిగా నడుస్తున్నదని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. యుద్ధ నేరాలకు పాల్పడినందుకు ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇరాన్‌పై దాడులు ఉధృతం చేస్తామని, ఆయుధాల తయారీ, వాడకంలో సాయపడుతున్న ప్రాంతాలు, భవనాలపై అదనపు దాడులు జరుగుతాయని కట్జ్ తెలిపారు. టెహ్రాన్‌లో బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాలు తయారు చేసే భవనాలపై శుక్రవారం దాడులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. పశ్చిమ ఇరాన్‌లో క్షిపణి లాంచర్లు, నిల్వ ప్రదేశాలపై కూడా దాడులు జరిపినట్లు కట్జ్ చెప్పారు. లెబనాన్ రాజధాని బీరుట్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన దాడిలో ఇద్దరు మరణించారు.

గల్ఫ్ దేశాలపై దాడులు

రియాద్‌ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కువైట్ నగరంలోని షువైఖ్ పోర్టు, చైనాకు చెందిన బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న ముబారక్ అల్ కబీర్ పోర్టు ఇరాన్ దాడుల్లో దెబ్బతిన్నట్లు కువైట్ తెలిపింది. గల్ఫ్‌లో చైనాకు చెందిన ప్రాజెక్టుపై దాడి జరగడం ఈ యుద్ధంలో ఇదే మొదటిసారి.

రాష్ట్రీయం

వైభవంగా భద్రాద్రి రాముడి కల్యాణోత్సవం

మొదటిపేజీ తరువాయి

మాంగళ్యధారణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గీత దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధికి తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు.

భక్త కోటిని నయనానందకరం

సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. ఈ వైభవాన్ని కనులారా తిలకించి లోకమంతా పులకించిపోయింది. భద్రాచలం దివ్యక్షేత్రంలో భక్త కోటిని నయనానందకరం చేసింది. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు సాగిన కల్యాణ క్రతువులో ప్రతీ ఘట్టం ఆధ్యాత్మిక రస సాగరంలో ముంచెత్తింది. ప్రత్యేకంగా అలంకరించిన మిథిలా ప్రాంగణంలో తొలుత తిరు కల్యాణానికి సంకల్పం పలికి, సర్వ విఘ్నాన శాంతికి ఆరాధన చేపట్టారు. కల్యాణానికి ఉపయోగించే సామగ్రిని సంప్రోక్షణ చేసిన తర్వాత రక్షా బంధనం నిర్వహించి యోకర్తధారణ చేశారు. ఇరు వంశాల గోత్రాలు పఠించి స్వామివారి పాద ప్రక్షాళన చేసి మహాదానాలు సమర్పించారు. వేద మంత్రోచ్చారణలు మార్మోగుతుండగా అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచారు. ఈ సమయాన్ని శుభ ముహూర్తమని జగత్ కల్యాణ శుభ సన్నివేశంగా కీర్తిస్తారు. రాముడి దోసిట తలంబ్రాలు నీలపు రాసులవుతుంటే జానకి దోసిట తలంబ్రాలు కెంపులయ్యాయి.

నేడు శ్రీరాముని పట్టాభిషేకం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాల్లో చివరి ఘట్టమైన శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం శనివారం జరగనుంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భద్రాచలం వచ్చిన భక్త జనానికి ఎలాంటి అసౌర్యం లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకంగా సెక్టార్లు ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా చలువ పందిళ్లు వేశారు. భక్తుల తాకిడి పెరుగుతుండటం, ప్రముఖుల రాక ఎక్కువ ఉండటంతో దాదాపు 2 వేల మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణం అనంతరం ప్రముఖులకు వేద పండితులు స్వామివారి గోటి తలంబ్రాలు అందజేశారు.

రాష్ట్రంలో మండుతున్న ఎండలు

- జిల్లాల్లో పెరుగుతున్న ఎండల తీవ్రత
- 40 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 27: భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండతో పాటు ఉక్కపోత కూడా పోస్తోంది. ఎండల తీవ్రతపై హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం పలు జిల్లాల్లో ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే, కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో పాటు తేలిక పాటి వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలియజేశారు. రెండు, మూడు రోజుల నుంచి భానుడి ప్రతాపంతో రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాధారణం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ప్రధానంగా ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని ప్రకటించారు. ఈ నెల 28 నుంచి రాష్ట్రంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని దీంతో ఉక్కపోతతో అసౌకర్యమైన వాతావరణం ఏర్పడుతుందని ఐఎమ్‌డీ అధికారులు తెలియజేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలతో భూ ఉపరితలం వేడెక్కడంతో గాలి తేలికపడి సుడిగాలులు వీయడం, దట్టమైన మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశముందని చెబుతున్నారు.

ఘనంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు

- స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- చైర్మన్ శివసేనారెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 27: ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేన రెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించబోతున్నామని తెలిపారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీలలో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు శాసన మండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్బాల్ క్రికెట్ అథ్లెటిక్స్, కబడ్డీ,వాలీబాల్ బాడ్మింటన్,టేబుల్ టెన్నిస్, తోపాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నయని తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామని, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణం

- భక్తుల రద్దీతో కళకళలాడిన కమ్మదనం రోడ్

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 27: కమ్మదనం రోడ్డులోని శ్రీగిరి మూలికా క్షేత్రంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. వేద మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కళ్యాణం సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందారు. కల్యాణ వేడుకలో ప్రతి ఘట్టం భక్తులను ఆకట్టుకోగా, "సీతారామ చంద్రమూర్తికి జై" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అన్నదానం మహోత్సవంగా కార్యక్రమం అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. నిర్వాహకులు సమర్థవంతంగా ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకున్నారు. ఈ వేడుకలో స్థానిక ప్రముఖులు, దాతలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెద్దజానంపేటలో ఘనంగా సీతారాముల కళ్యాణం

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 27: పెద్ద జానంపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. దేవాలయ ప్రాంగణంలో ఉన్న సీతారాములస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి దీవెనలు అందుకున్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడగా, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, వంకాయల నారాయణరెడ్డి వివిధ పార్టీల నెత లు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ "ఏ మచ్చ లేకుండా రాజ్యాన్ని పాలించిన శ్రీరామచంద్రుడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాల్లో పాల్గొనడం తనకు గొప్ప భాగ్యం" అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ "ఈ తరహా ఉత్సవాలు సమాజాన్ని ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మాజీ జడ్పీటీసీ కందివరం సూర్యప్రకాశ్, రఘునాథ్ యాదవ్, కుమార్ గౌడ్, చెంది తిరుపతి రెడ్డి, మురళీ మోహన్, దిలీప్, బచ్చలి నరేష్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ముబారక్ అలీ ఖాన్, సాధిక్, మాధవులు యాదవ్, యదిగిరి యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు అతిథులను సత్కరించారు.

ఉన్నత విద్యను ప్రోత్సహించడంలో..

ప్రొఫెసర్ ఇలియాస్- ఉర్- రహమాన్ విశేష సేవలు

- సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు కైవసం
- అభినందించిన షాదన్ విద్యా సంస్థల అధ్యాపకులు, యాజమాన్యం

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, మార్చి 27: ఉన్నత విద్యను ప్రోత్సహించడంలో ఆయన చేసిన విశేషమైన సేవలు మరియు కృషికి గుర్తింపుగా ఖైరతాబాద్ షాదన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్, షాదన్ డిగ్రీ కాలేజ్ ఫర్ బాయ్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇలియాస్ ఉర్ రహమాన్ అనేక ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. విశిష్ట విద్యావేత్త, ప్రొ.ఇలియాస్ ఉర్ రహమాన్ ప్రఖ్యాత జాతీయ పత్రికలలో 62 పరిశోధనా పత్రాలు, అంతర్జాతీయ జర్నల్స్‌లో 34 పత్రాలను రచించారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో ఆయన అనేక పరిశోధనా పత్రాలను సమర్పించారు. అనేక అంతర్జాతీయ సెమినార్లలో ప్రాతినిధ్యం వహించారు. గుర్తింపు పొందిన రీసెర్చ్ సూపర్‌వైజర్‌గా, 12 పీహెచ్‌డీలని విజయవంతంగా నడిపించారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం, సీఎంజే విశ్వవిద్యాలయంలో అయన పర్యవేక్షణలో 11 మంది డాక్టరల్ అధ్యయనాలను కొనసాగిస్తున్నారు. విద్యా రంగానికి ఆయన చేసిన అసమానమైన కృషికి గుర్తింపుగా ప్రొ. ఇలియాస్ ఉర్ రహ్మాన్ అనేక ప్రతిష్టాత్మక అవార్డులతో సత్కరించబడ్డారు. భారత్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డు(2026), నేషనల్ ఎక్సలెన్స్ అచీవర్ అవార్డు(2026), బెస్ట్ ప్రిన్సిపాల్ ఆఫ్ ట్రినియం అవార్డు(2026), ఉత్తమ విద్యావేత్త అవార్డు(2025), ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు(2024) అవార్డులను ఆయన అందుకున్నారు. ఈ అవార్డులు ఉన్నత విద్యా రంగంలో అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా అందుకున్నారు. షాదన్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్, డాక్టర్ మహమ్మద్ షా ఆలం రసూల్ ఖాన్, ఈ ప్రొఫెసర్ ఇలియాస్ ఉర్ రెహ్మాన్‌కు అభినందనలు తెలిపారు. షాదన్ అధ్యాపకులు, మేనేజ్‌మెంట్, విద్యార్థులు కూడా తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆయన ఉపాధ్యాయ సమాజానికి స్ఫూర్తిదాయకంగా అభివర్ణించారు.

"

సరిహద్దు, కోస్టల్ రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలి. షిప్పింగ్, నిత్యావసరాల సరఫరా, సముద్ర కార్యకలాపాల విషయంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలి. వ్యవసాయ రంగం విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం. ఎరువుల స్టోరేజీ, సరఫరాను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలి. తప్పడు సమాచారం వ్యాప్తి చెందకుండా చూసుకోవాలి.

- సీఎంలతో ప్రధాని నరేంద్ర మోడీ

ఓపెన్ వాయిస్

మహిళా నేతలు కావలెను!!

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక భారీ మార్పు రాబోతోంది. నియోజకవర్గాల పునర్విభజనతో పెరగనున్న సీట్లు , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రానుండటంతో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ యవనికపై మహిళా నేతల హవా మొదలుకానుంది. ఇప్పటి వరకు పురుషాధిక్య రాజకీయాల్లో అవకాశాల కోసం ఎదురుచూసిన ఎంతో మంది చైతన్యవంతులైన మహిళలకు ఇది నిజంగానే గోల్డెన్ టైమ్ అని చెప్పవచ్చు. ప్రతి ముగ్గురు ఎమ్మెల్యేలలో ఒకరు కచ్చితంగా మహిళా నేతే ఉండబోతుండటంతో, ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మహిళా కేడర్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డాయి.2029 అసెంబ్లీ ఎన్నికలు.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతోపాటు 33 శాతం మహిళా రిజర్వేషన్లు కూడా అమలు కానున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఏ ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసినా పెరగబోయే స్థానాలు, మహిళా రిజర్వేషన్ కింద దక్కబోయే సీట్లపైనే చర్చించుకుంటున్నారు.నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో ఇప్పుడున్న 119 అసెంబ్లీ సీట్లు 179కి పెరగనున్నాయి. 33 శాతం విమెన్ రిజర్వేషన్ అమలైతే తెలంగాణలో వారికి ఏకంగా 59 సీట్లు దక్కనున్నాయి. మహిళలకు ఇంత పెద్ద సంఖ్యలో అసెంబ్లీ సీట్లు రిజర్వుకానుండడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తమ కుటుంబాల్లోని మహిళలకు రెండో సీటుపై ఇప్పటి నుంచే కన్నేస్తున్నారు. ఆ దిశగా భార్య, కూతు రు, కోడలుతో రాజకీయ పరిచయ కార్యక్రమం చేయిస్తున్నారు. పండుగలు, పబ్బాలు, ఇతర శుభ కార్యాలను పురస్కరించుకొని ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు శుభాకాంక్షలు చెపుతూ ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీటిపై జనాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరిగితే అందులో సుమారు 80 స్థానాలు మహిళలకే కేటాయించాల్సి ఉంటుంది. అలాగే తెలంగాణలో 60 స్థానాలు మహిళలకు రిజర్వ్ అవుతాయి. అంటే రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 140 మందికి పైగా మహిళా ఎమ్మెల్యేలు చట్టసభల్లో అడుగుపెట్టబోతున్నారు. గతంలో కేవలం 10 నుంచి 15 శాతం లోపే ఉన్న మహిళా ప్రాతినిధ్యం, ఇప్పుడు ఏకంగా 33 శాతానికి పెరగడం రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేయనుంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, చాలా చోట్ల భర్తలు లేదా కుటుంబ సభ్యులు ప్రాక్సీ లుగా పాలన సాగించేవారు. కానీ, అసెంబ్లీ స్థాయికి వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉండబోతోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వాడకం, పెరిగిన విద్యావంతుల సంఖ్య, మహిళల్లో వచ్చిన రాజకీయ చైతన్యంతో సొంతంగా ఎదిగే నేతలకే ప్రాధాన్యత పెరగనుంది. పార్టీలు కూడా కేవలం డమ్మీ అభ్యర్థులను కాకుండా, ప్రజల్లో పట్టున్న, సొంతంగా గెలవగల సామర్థ్యం ఉన్న మహిళా నేతలకే టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది.ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలైన టీడీపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, బీఆర్ఎస్, కాంగ్రెస్ , బీజేపీలలో ద్వితీయ శ్రేణి మహిళా నాయకత్వం బలంగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై గళం విప్పడం వంటి పనుల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖచ్చితం కావడంతో, ఇప్పటి వరకు తెర వెనుక ఉండి పనిచేసిన మహిళా నేతలు ఇప్పుడు నేరుగా ప్రజల ముందుకు వచ్చి తమ నాయకత్వ లక్షణాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇది రాజకీయాల్లో ఒక రకమైన వడపోత కు దారితీసి, అసలైన సమర్థులైన మహిళా నేతలను బయటకు తీస్తుంది.మహిళా రిజర్వేషన్ల వల్ల కేవలం లింగపరమైన ప్రాతినిధ్యమే కాకుండా, సామాజిక సమీకరణాలు కూడా మారుతాయి. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో మహిళా నేతల ఎంపిక కోసం పార్టీలు కొత్త వ్యూహాలను రచించాల్సి ఉంటుంది. మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో, ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక సమస్యలపై చర్చ ఎక్కువగా జరుగుతుంది. ఇది రాజకీయాల్లో క్వాలిటీ ని పెంచుతుందనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల్లో మహిళా నేతలకు రాబోయే ఐదేళ్లు అత్యంత కీలకం. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు వారు చేరుకోబోతున్నారు. పార్టీలు కూడా తమ గెలుపు గుర్రాలను వెతుక్కునే క్రమంలో మహిళా అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నాయి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని అన్ని రంగాల్లో మహిళల సాధికారతకు బాటలు వేయనుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
28.03.2026

విలన్ కాదు.. విశ్వసనీయ శక్తి!

సుమారు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక దిగ్బంధనాలు, రాజకీయ ఒత్తిళ్ల మధ్య కూడా ఏమాత్రం కుంగిపోకుండా తనదైన మార్గంలో ముందుకు సాగుతూ ప్రపంచ రాజకీయాల్లో ఇరాన్ ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తోంది. అయితే అదే సమయంలో, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి మరియు స్థిరత్వం నెలకొనాలంటే ఇరాన్‌తో కూడిన సమతుల్యమైన చర్చలు జరగడం ఎంతైనా అవసరమని అంతర్జాతీయ సమాజం గుర్తించాలి. భవిష్యత్తులో ఈ ప్రాంత రాజకీయాల దిశను నిర్దేశించేది కేవలం ఆయుధ బలమే కాదు, టెహ్రాన్ తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలే అవుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఫిరోజ్ ఖాన్
9640466464

పశ్చిమాసియా రణరంగంలో అంతర్జాతీయ అంచనాలను సవాల్ చేస్తూ, "బలం మాత్రమే కాదు... వ్యూహమే అసలైన శక్తి" అనే సందేశాన్ని ఇరాన్ తన పదునైన చర్యల ద్వారా ప్రపంచానికి చాటిచెబుతోంది. ఒకప్పుడు విదేశీ ప్రభావానికి లోనైన దేశం, నేడు స్వయం పాలన వైపు దృఢమైన అడుగులు వేస్తూ అంతర్జాతీయ వేదికపై తన స్థానాన్ని పునర్నిర్వచించుకుంటోంది. పెర్షియన్ చరిత్రలోని ఆత్మగౌరవాన్ని ఆధునిక రాజకీయాల్లో ప్రతిబింబిస్తూ, టెహ్రాన్ చేపడుతున్న నిర్ణయాలు ప్రపంచ శక్తుల దృష్టిని ఆకర్షించడమే కాకుండా వారిని ఆలోచనలో పడేస్తున్నాయి. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు ఎదురైనా తనదైన విధానంలో ముందుకు సాగుతూ ఇరాన్ అనుసరిస్తున్న వైఖరి, గ్లోబల్ పవర్ సమీకరణాల్లో సరికొత్త చర్చలకు దారి తీస్తోంది. ఈ పరిణామాలన్నీ పశ్చిమాసియా భవిష్యత్తుపై అంచనాలను పెంచుతూ, ఇరాన్ ను ఒక అనివార్య శక్తిగా మారుస్తున్నాయి.

ఎదుగుదల వెనుక దాగిన అసలు నిజాలు

చారిత్రక సత్యాలను విశ్లేషిస్తే, 1953 ఆగస్టు 19న సంభవించిన మొసాదెగ్ ప్రజాస్వామ్య ప్రభుత్వ పతనం ఇరాన్ రాజకీయాల్లో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది. కేవలం తమ దేశ చమురు సంపదను జాతీయం చేయాలని నిర్ణయించినందుకే విదేశీ శక్తులు చేసిన జోక్యం, పెర్షియన్ల మనసుల్లో ఒక రకమైన వ్యతిరేకతకు బీజం వేసింది. అనంతరం 1979 ఫిబ్రవరి 11న ఆయతుల్లా ఖొమేనీ నాయకత్వంలో సంభవించిన ఇస్లామిక్ విప్లవం ఇరాన్‌కు పూర్తి స్థాయి స్వతంత్ర దిశను ఇచ్చి, విదేశీ పెత్తనానికి శాశ్వతంగా చరమగీతం పాడింది. ఆ తరువాతి కాలంలో 1980 నుండి 1988 వరకు ఎనిమిదేళ్ల పాటు సాగిన ఇరాక్ యుద్ధంలో ఏ ఒక్క దేశం మద్దతు లేకపోయినా, అపారమైన ప్రాణ, ఆస్తి నష్టాలను భరించి మరీ దేశ సమగ్రతను కాపాడుకోవడం ఇరాన్ పట్టుదలకు నిదర్శనం. నేడు వివిధ ఒత్తిళ్లను తట్టుకుంటూ చైనా, రష్యా వంటి దేశాలతో వ్యూహాత్మక మైత్రిని పెంచుకుంటూ, ప్రపంచ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక సమతుల్యతను సాధించేందుకు ఇరాన్ గట్టిగా ప్రయత్నిస్తోంది. 2021లో చైనాతో కుదుర్చుకున్న 25 ఏళ్ల సుదీర్ఘ ఒప్పందం ఆ దేశ ఆర్థిక మూలాలను బలోపేతం చేసింది.

శాస్త్రవేత్తల హత్యలు జరిగినా.. ఆగని అణు ప్రస్థానం

సాంకేతిక రంగంలో ఇరాన్ సాధించిన పురోగతి నేడు ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది; ముఖ్యంగా రక్షణ, క్షిపణి, డ్రోన్ సాంకేతికతల్లో ఆ దేశం సాధించిన అభివృద్ధి అంతర్జాతీయ వేదికలపై పెను చర్చలకు దారి తీసింది. 2020 నవంబర్ 27న అంతర్జాతీయంగా అనుమానాలు వ్యక్తమైన ఘటనలో అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్త మోహ్సేన్ ఫక్రీజాదే హత్యకు గురైనా, ఆ ఘోర ఘటన దేశ పరిశోధనా వేగాన్ని ఏమాత్రం ఆపలేకపోయింది సరికదా మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని శాంతియుత అవసరాల కోసం, విద్యుత్ ఉత్పత్తి, వైద్య రంగం కోసం మాత్రమేనని ఐక్యరాజ్యసమితి వేదికగా

బలంగా సమర్థిస్తూనే, యురేనియం శుద్ధి సామర్థ్యాన్ని 60 శాతం వరకు పెంచుకోవడం గమనార్హం. కేవలం ఆయుధ సంపత్తే కాకుండా, సైబర్ భద్రత నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు ఇరాన్ చూపుతున్న పురోగతి దాని మేధో సంపత్తికి, సాంకేతిక స్వావలంబనకు స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. 2019లో అత్యాధునిక 'గ్లోబల్ హాక్' డ్రోన్‌ను తమ స్వదేశీ రక్షణ వ్యవస్థతో కూల్చివేయడం ద్వారా ఇరాన్ తన రక్షణ శక్తి ఎంతటిదో లోకానికి చాటిచెప్పింది. సాంకేతిక ఎదుగుదల అనేక దేశాలకు ఆశ్చర్యం కలిగిస్తున్నప్పటికీ, అది ఇరాన్ కు ఒక రక్షణ కవచంలా మారి దాడులను సమర్థవంతంగా అడ్డుకుంటోంది.

గల్ఫ్ యుద్ధంలో 'బాహుబలి'గా విశ్వరూపం!

ప్రస్తుత భౌగోళిక రాజకీయ చదరంగంలో ఇరాన్ తనదైన 'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' వ్యూహంతో ప్రధాన పాత్ర పోషిస్తోంది, ఇది అంతర్జాతీయ వ్యూహాలకు సవాలు విసురుతూ ముందుకు సాగుతోంది. పాలస్తీనా అంశంలో తన గొంతుకను బలంగా వినిపిస్తూ, లెబనాన్‌లోని హిజ్బుల్లా, యెమెన్‌లోని హూతీలు మరియు సిరియాలోని పలు వర్గాలకు వ్యూహాత్మక మద్దతు ఇస్తూ తన ప్రభావాన్ని మధ్యధరా సముద్రం వరకు విస్తరించింది. 2021లో చైనాతో కుదిరిన 400 బిలియన్ డాలర్ల ఒప్పందం, ఆంక్షల మధ్య ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు గొప్ప ప్రాణవాయువుగా నిలిచిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ కలిగి ఉన్న పట్టు, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రభావితం చేయగల స్థాయికి ఆ దేశాన్ని చేర్చింది. ఇరాన్ తన సైనిక శక్తిని ఆధునీకరించుకుంటూ ప్రాంతీయ శక్తి సమతుల్యతను ప్రభావితం చేసే ప్రయత్నంగా ముందుకు సాగుతోంది. ఈ వ్యూహాత్మక అడుగులు కేవలం భద్రతా అవసరాలకే కాకుండా, ప్రాంతీయంగా తన ప్రాధాన్యతను పెంచుకునే ఒక బృహత్తర ప్రణాళికలో భాగమని స్పష్టమవుతోంది. ఇరాన్ అనుసరిస్తున్న బహుళ కోణాల వ్యూహం నేడు ప్రపంచవ్యాప్తంగా రాజకీయ మేధావులను సైతం విస్మయానికి గురిచేస్తూ, కొత్త చర్చలకు తావిస్తోంది.

ఇరాన్‌ను తక్కువ అంచనా వేయొద్దు

ఇరాన్ ను కేవలం ఒక కోణంలో లేదా మతపరమైన దృష్టితో మాత్రమే అర్థం చేసుకోవడం ఎవరికైనా కష్టమైన పని. అది దశాబ్దాల ప్రతిఘటన, పక్కా వ్యూహం, అచంచలమైన ఆత్మగౌరవం మేళవింపుగా రూపుదిద్దుకున్న దేశం. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక దిగ్బంధనాలు, రాజకీయ ఒత్తిళ్ల మధ్య కూడా ఏమాత్రం కుంగిపోకుండా తనదైన మార్గంలో ముందుకు సాగుతూ ప్రపంచ రాజకీయాల్లో ఇరాన్ ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తోంది. అయితే అదే సమయంలో, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి మరియు స్థిరత్వం నెలకొనాలంటే ఇరాన్‌తో కూడిన సమతుల్యమైన చర్చలు జరగడం ఎంతైనా అవసరమని అంతర్జాతీయ సమాజం గుర్తించాలి. భవిష్యత్తులో ఈ ప్రాంత రాజకీయాల దిశను నిర్దేశించేది కేవలం ఆయుధ బలమే కాదు, టెహ్రాన్ తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలే అవుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇరాన్‌ను ఒక విలన్‌గా చిత్రీకరించే ప్రయత్నం పక్కన పెట్టి, ఆ దేశ చరిత్రను, పోరాటాన్ని ఒక సమగ్ర దృక్కోణంతో విశ్లేషించి అర్థం చేసుకోవడం నేటి ప్రపంచానికి ఎంతో అవసరం.

(వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

కంచే చేను మేస్తే కాపాడేదెవరు?

వెంక గారి భూమయ్య
9848559863

నిర్మల్ జిల్లా నుండి నారాయణపేట వరకు నేడు ప్రభుత్వ పాఠశాలలు విద్యాబుద్ధులు నేర్పే ఆలయాలుగా కాకుండా కొందరు కామ పిశాచాల క్రీడారంగాలుగా మారుతుండటం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయం. మెరుగైన సమాజ నిర్మాణంలో మూలస్తంభాలుగా ఉండాల్సిన ఉపాధ్యాయులే నైతికతను విస్మరించి రాక్షసుల్లా ప్రవర్తిస్తుంటే రేపటి తరం భవిష్యత్తు ఏమైపోవాలి అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే దారి తప్పి తండ్రి తర్వాత తండ్రి లాంటి హోదాలో ఉండి అభం శుభం తెలియని చిన్నారుల జీవితాలతో చెలగాటమాడుతుండటం అత్యంత ఘోరం. నారాయణపేట జిల్లా మద్దూరు ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్న ఘటన ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చగా మిగిలింది. స్కూల్ అసిస్టెంట్ హోదాలో ఉండి విలువలు నేర్పాల్సిన తెలుగు టీచర్ స్వామి కంప్యూటర్ ల్యాబ్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థిని పట్ల ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైనది. తెలిసీ తెలియని ఆ వయస్సులో ఏవైనా పొరపాట్లు జరిగితే తప్పు అని చెప్పాల్సిన వ్యక్తే ఆ బాలికను అమాంతం ముద్దు పెట్టుకుని తన కామవాంఛను తీర్చుకోవాలని చూడటం అమానుషం. సీసీటీవీ ఫుటేజీలో ఈ స్వామి అసభ్య ప్రవర్తన బయట పడటంతో డీఈఓ సస్పెన్షన్ వేటు వేశారు కానీ కేవలం సస్పెన్షన్ చేస్తే సరిపోతుందా అన్నదే నేడు అసలైన ప్రశ్న. ఇలాంటి ఘటనలు ఒక్క నారాయణపేటకే పరిమితం కాలేదు. గతంలో నిర్మల్ జిల్లా నర్సాపూర్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల కీచక పర్వం సాగించి పోక్సో కేసులకు గురయ్యారు. తాజాగా నిర్మల్ రూరల్ పరిధిలోని కొండాపూర్ పాఠశాల విద్యార్థినులపై కూడా ఒత్తిడి తెచ్చి లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. కుబీర్ మండలం లోనూ ఇలాంటి ఛాయలే గతంలో వెలుగుచూశాయి. వరుసగా ఇన్ని ఉదంతాలు వెలుగుచూస్తున్నాయంటే కీచక గురువులకు చట్టం అన్నా వ్యవస్థ అన్నా భయం లేకుండా పోయిందని స్పష్టమవుతోంది. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను దేవుడి గుడిలా కాపాడాల్సిన ఉపాధ్యాయులే భక్షకులుగా మారుతుంటే ఇక పేద విద్యార్థులు ఎవరికి మొరపెట్టుకోవాలి. సాధారణంగా ఇలాంటి అకృత్యాలు జరిగినప్పుడు విద్యాశాఖ తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసి చేతులు దులుపుకుంటుంది. కానీ సస్పెన్షన్ అంటే అది శిక్ష కాదు కేవలం విచారణ పూర్తయ్యే వరకు విధులకు దూరం పెట్టడం మాత్రమే. పోక్సో కేసులు పెట్టినా కొన్నాళ్లకు బెయిల్ మీద బయటకు వచ్చి కోర్టుల్లో ఏళ్ల తరబడి సాగే విచారణను అడ్డం పెట్టుకుని రాజకీయ పైరవీలతో మళ్ళీ అదే ఉద్యోగాల్లోకి చేరుతున్న



దాఖలాలు మన కళ్లముందే ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగం నుండి పూర్తిగా రిమూవ్ చేస్తే తప్ప ఇలాంటి వారికి బుద్ధి రాదు. ఒక విద్యార్థిని జీవితంతో ఆడుకున్న వ్యక్తికి మళ్ళీ ఉపాధ్యాయుడిగా కొనసాగే అర్హత లేదని చట్టాలు గట్టిగా చెప్పాలి. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది అత్యధికంగా పేద బహుజన వర్గాల పిల్లలే. తల్లిదండ్రులు తమ పిల్లలు కష్టపడి చదువుకుని ప్రయోజకులు అవుతారని నమ్మి పంపిస్తుంటే అక్కడ కామ పిశాచాలు కాచుకుని కూర్చున్నాయన్న భయం ఇప్పుడు తల్లిదండ్రులను వెంటాడుతోంది.

ఇలాంటి ఘటనల వల్ల ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లడానికే భయపడే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా ప్రతి పాఠశాలలో విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కేవలం సీసీటీవీలు ఉంటే సరిపోదు వాటి ఫుటేజీని ప్రతిరోజూ పర్యవేక్షించే జవాబుదారీతనం ఉండాలి. నారాయణపేట స్వామి అయినా నిర్మల్ కీచక గురువులైనా ఎవరైనా సరే విచారణను వేగవంతం చేసి వారిని కఠిన కారాగారానికి పంపాలి. పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు పడేలా చూడటమే కాకుండా వారిని ప్రభుత్వ సర్వీసు నుండి శాశ్వతంగా బహిష్కరించాలి. అప్పుడే మరో ఉపాధ్యాయుడు విద్యార్థినుల వైపు కన్నెత్తి చూడటానికి భయపడతాడు. గురువు అనే పదానికి గౌరవం దక్కాలంటే ఈ రాక్షసులను విద్యా వ్యవస్థ నుండి తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మన చట్టాలు కూడా దోషులను రక్షించే విధంగా ఉండకూడదు. బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. కేవలం అక్షరాలు నేర్పడం మాత్రమే కాదు నైతిక విలువల ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకం జరగాలి. ఏ ఒక్క ఉపాధ్యాయుడి ప్రవర్తన కూడా అనుమానాస్పదంగా ఉన్నా వెంటనే చర్యలు తీసుకునే హక్కు విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు ఉండాలి. సమాజంలో గురువుకు ఉన్న ఉన్నతమైన స్థానాన్ని కొందరు కామాంధులు నాశనం చేస్తుంటే మిగిలిన ఉపాధ్యాయ లోకం మౌనంగా ఉండటం కూడా నేరమే. కీచక గురువుల అరాచకాలపై గొంతెత్తి పోరాడాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన విద్యాలయాలు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అప్పుడే ఆ చిన్నారులకు నిజమైన న్యాయం జరుగుతుంది విద్యాలయాల్లో చదువుల వెలుగు నిండుతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మార్కాపూర్ సెగలు: ఆధునిక రవాణా వ్యవస్థకు ఒక హెచ్చరిక

జనక మోహన రావు దుంగ
8247045230

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, మార్కాపూర్ సమీపంలో ఇటీవల జరిగిన ఘోర బస్సు అగ్నిప్రమాదం యావత్ రెండు తెలుగు రాష్ట్రాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అర్ధరాత్రి వేళ ప్రయాణికులు గాఢనిద్రలో ఉన్న సమయంలో, విధి మంటల రూపంలో విరుచుకుపడటం అత్యంత హృదయవిదారకం. హైదరాబాద్ నుండి పామూరు వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న వెంటనే అగ్నిగుండంగా మారడం వెనుక కేవలం 'దురదృష్టం' అనే మాటతో సరిపెట్టుకోలేము. ఇది వ్యవస్థాగత లోపాలు, మానవ తప్పిదాలు, భద్రతా ప్రమాణాల ఉల్లంఘనల కలయికగా కనిపిస్తోంది. ఈ ఘటన మన రహదారి భద్రతపై అనేక మౌలిక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

ఈ మరణాలకు కారణాలెన్నో!

ఈ ప్రమాదంలో ప్రాణనష్టం పెరగడానికి ప్రధాన కారణం బస్సు వేగం, దాని రూపకల్పనలో ఉన్న లోపాలు. ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నప్పుడు, ఇంజన్ భాగం నుండి మంటలు రావడం సహజం. అయితే, డీజిల్ ట్యాంక్ పగిలిన సెకన్ల వ్యవధిలోనే మంటలు బస్సు లోపలికి వ్యాపించడం ఆందోళనకరం. బస్సు నిర్మాణంలో 'అగ్ని నిరోధక' సామగ్రిని వాడకపోవడం వల్ల నిప్పు త్వరగా విస్తరించింది. మరోవైపు, డ్రైవర్ అజాగ్రత్త లేదా నిద్రమత్తు కారణంగా వాహనం అదుపు తప్పడం ప్రాథమికంగా కనిపిస్తున్న తప్పిదం. సుదీర్ఘ ప్రయాణాల్లో డ్రైవర్ల శారీరక, మానసిక స్థితిని పర్యవేక్షించే పటిష్టమైన వ్యవస్థ లేకపోవడం ఇక్కడ స్పష్టమవుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి బస్సులో విధిగా ఉండాల్సిన 'అత్యవసర ద్వారం' ఈ ప్రమాద సమయంలో ప్రయాణికులకు అందుబాటులో లేకపోవడం పెద్ద వైఫల్యం. మంటలు వ్యాపించినప్పుడు కిటికీ అద్దాలు పగులగొట్టడానికి అవసరమైన సుత్తులు లేకపోవడం వల్ల చాలామంది లోపలే చిక్కుకుపోయారు. అలాగే, బస్సులో అగ్నిమాపక పరికరాలు ఉన్నప్పటికీ, వాటిని వాడే తగిన శిక్షణ సిబ్బందికి లేకపోవడం వల్ల ప్రాథమిక దశలోనే మంటలను ఆర్పే అవకాశం కోల్పోయారు. ఆధునిక ఏసీ బస్సులు బయటి గాలి చొరబడకుండా పూర్తిగా సీల్ చేయబడి ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ పనిచేయదు, ఫలితంగా బస్సు ఒక ఇనుప బోనులా మారుతుంది. లోపల మంటలు వ్యాపించినప్పుడు వెలువడే విషవాయువులు ప్రయాణికులను క్షణాల్లో అపస్మారక స్థితిలోకి నెట్టేస్తాయి. ఇది మరణాల సంఖ్య పెరగడానికి దారితీసింది.

ఉక్కుపాదం మోపాలి:

భద్రతా నిబంధనలు అనేవి కేవలం కాగితాల మీద సంతకాలకు పరిమితం కావడం వల్లనే ఇలాంటి విషాదాలు పునరావృతమవుతున్నాయి. ప్రస్తుత మోటార్ వాహనాల చట్టంలో ప్రమాదాలకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకునేలా మార్పులు రావాలి. ప్రస్తుతం అమలులో ఉన్న మోటార్ వాహనాల చట్టం కేవలం జరిమానాలపైనే దృష్టి పెడుతోంది, కానీ ఇలాంటి ఘోరకలి జరిగినప్పుడు బాధ్యులను కఠినంగా శిక్షించేలా చట్టాల్లో మార్పులు రావాలి. ప్రమాదానికి కారణమైన బస్సు యాజమాన్యంపై 'నేరపూరిత నిర్లక్ష్యం' కింద హత్య కేసులు నమోదు చేయాలి. ప్రాణనష్టానికి కారణమైన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వారి పర్మిట్లను రద్దు చేయాలి. బస్సుల తయారీలోనే 'సెన్సార్ ఆధారిత అగ్నిమాపక వ్యవస్థలు' తప్పనిసరి చేయాలి. విమానాల్లో ఉండే 'బ్లాక్ బాక్స్' తరహా పరికరాలను బస్సుల్లో కూడా అమర్చి, డ్రైవర్ ప్రవర్తనను రికార్డ్ చేసే విధానం తీసుకురావాలి. ప్రమాదం జరిగిన తర్వాత ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం కంటే, ప్రమాదం జరగకుండా నిరోధించే వ్యవస్థల మీద పెట్టుబడి పెట్టడం ముఖ్యం.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

పొన్నం రవిచంద్రకు కవుల అభినందన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గద్దర్ నంది అవార్డు గ్రహీత ప్రముఖ జర్నలిస్ట్ పొన్నం రవిచంద్ర శుక్రవారం హుస్నాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ కవులు ఆయనను అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జన జాగృతి కళా సమితి పక్షాన కవి సాయంత్రం కవులు ముక్కెర సంపత్ కుమార్, దేవర కనకయ్య, కనుకుంట్ల శ్రీనివాస్ తో పాటు కొలుగూరి అశోక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

-ప్రతిపక్షం, హుస్నాబాద్

ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 27 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్‌లోని భౌరంపేట్ ప్రాంతంలో శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమానికి దుండిగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ శంభిపూర్ కృష్ణవేణికృష్ణ, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీతో పాటు వివిధ కమ్యూనిటీ కాలనీలలో నిర్వహించిన కల్యాణ వేడుకలకు హాజరై భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో భక్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నర్సా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ శ్రీరాముని జీవితం ధర్మం, నిజాయితీ, న్యాయం కోసం నిలిచిన గొప్ప ఆదర్శమని తెలిపారు. సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ శ్రీరాముని మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరాముని స్ఫూర్తితో జీవితం పావనం అవ్వాలి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 27: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో మాజీ సర్పంచ్ కావలి దశరథ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. కావలి దశరథ మాట్లాడుతూ.. ఒక కొడుకుగా, సోదరుడిగా, భర్తగా, తండ్రిగా, స్నేహితుడిగా,రాజు గా శ్రీ రామ చరితం అన్ని విధాలా ఆదర్శ ప్రాయమని అన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని, ఆ దివ్యమూర్తులను ప్రార్థిస్తూ... గ్రామంలో ఉన్న సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు మరియు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకకు విచ్చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న కేఎల్ఆర్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 27: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ శ్రీ రామాలయం, రామకృష్ణ పురం డివిజన్ పరిధిలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్), మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారి కళ్యాణ తంతును దగ్గరుండి తిలకించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడని, లోక కళ్యాణం కోసం జరిగిన ఈ సీతారాముల కళ్యాణం కమనీయంగా సాగడం సంతోషకరమని పేర్కొన్నారు. రామరాజ్యం అనేది సుపరిపాలనకు శాశ్వత నమూనా అని, శ్రీరాముని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్‌నేత యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనరాజ్ గౌడ్, లింగస్వామి గౌడ్,చిక్కుళ్ళ శివ ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, జంగారెడ్డి,శ్రీనివాస్, భాస్కర్,రంజిత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేటలో సీతారాముల కళ్యాణం

- పాల్గొన్న మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 27: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని అమీర్పేట్ గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య పాల్గొన్నారు. అనంతరం యాదయ్య మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలతోపాటు నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజలందరిపై ఆ సీతారాముల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

అమ్దాపూర్‌లో భారీ చోరీ

- 20 తులాల బంగారం, రూ. 10 లక్షల నగదు అపహరణ!
- తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దుండగులు.
- ఆనవాళ్లు దొరక్కుండా మిరపపొడి చల్లి బీభత్సం.

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 27 : మండల పరిధిలోని అమ్దాపూర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి భారీ దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోలా శ్రీనివాస్ ఈ నెల 23న టూర్ నిమిత్తం గోవాకు వెళ్లారు. ఆయన భార్య అనిత, పిల్లలు 25వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి మంచిరేవులలోని బంధువుల ఇంటికి వెళ్లారు.

కారంపొడి చల్లి.. వేలిముద్రలు దొరక్కుండా జాగ్రత్తపడి

గురువారం (26వ తేదీ) సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అనిత తిరిగి ఇంటికి వచ్చేసరికి మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉండటం చూసి విస్తుపోయారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు విరగ్గొట్టి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగలు అతి తెలివిగా ప్రవర్తించి, క్లూస్ టీమ్‌కు వేలిముద్రలు దొరకకుండా గదుల్లో, నేలపై మిరపపొడి చల్లారు.

పోగొట్టుకున్న సొత్తు విలువ భారీగా

బీరువాలో దాచిన 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 10 లక్షల నగదు మాయమైనట్లు బాధితులు గుర్తించారు. మాయమైన బంగారంలో లాంగ్ చైన్, మూడు తులాల నెక్లెస్, మూడు తులాల మ్యాట్కీలు, కమ్మలు, ఉంగరాలు, గొలుసులు ఉన్నట్లు శ్రీనివాస్ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడు కోలా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా సీతారామ కళ్యాణం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 27: మొయినాబాద్ మండల పరిధిలోని అమ్దాపూర్ గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు గురు వారం అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మన్నె ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అండాపూర్ పురవీధులన్నీ భక్తి పారవశ్యంతో పులకించాయి. ఈ సందర్భంగా మన్నె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆ స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల క్షేమం కోసమే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి, వివిధ వార్డుల సభ్యులు, గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాకారం జాగీర్ 'రామ' మయం

- వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రతిపక్షం,మొయినాబాద్ , మార్చి 27 : మండల పరిధిలోని బాకారం జాగీర్ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సీతమ్మరామయ్యల కల్యాణాన్ని భక్తులు తన్మయత్వంతో వీక్షించారు. లోకకల్యాణం కోసమే ఈ వేడుక ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం సీతారాముల కల్యాణాన్ని జరిపించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఆ శ్రీరామచంద్రుని కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దప్పిక తీర్చనున్న 'షాబాద్ దర్శన్'

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 27 : వేసవి తాపానికి అల్లాడుతున్న బాటసారుల దాహార్తిని తీర్చేందుకు 'షాబాద్ దర్శన్' సామాజిక వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ కేంద్రాన్ని నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి ఎండల దృష్ట్యా ప్రయాణికులకు, పాదచారులకు చల్లని తాగునీరు అందించాలనే సంకల్పంతో ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షాబాద్ దర్శన్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 27: శ్రీరామనవమిని పురస్కరించుకొని చేవెళ్ల నియోజకవర్గంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు జరిపారు. చేవెళ్ల నియోజకవర్గం లో చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్ పల్లి, మండలం, మున్సిపల్ పరిధిలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేలకు అర్చకులు,గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కౌకుంట్ల గ్రామంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల పట్టణ కేంద్రంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.

రాములోరి కళ్యాణానికి హాజరైన హనుమాన్ భక్తులు

రాములోరి కళ్యాణానికి హనుమాన్ భక్తులుగా హాజరుకావడం మా అదృష్టంగా భావిస్తున్నాం అని దీక్షపరులు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డులో ఉన్న రామాలయంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు హాజరై కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ పవిత్ర దినాన స్వామివారిని దర్శించుకోవడం ఎంతో భాగ్యంగా భావిస్తున్నామని నియమ నిష్ఠలతో దీక్ష కొనసాగిస్తూ శ్రీ రాముడి కృప పొందాలని కోరుకుంటున్నాం అని దీక్షపరులు తెలిపారు. వారు సమూహంగా జయ నినాదాలతో ఆలయానికి చేరుకోవడంతో ఆధ్యాత్మికతతో సంతరించుకుంది.

"

ఒకే పరిస్థితి ఎదురైనప్పుడు మగాళ్లతో పోలిస్తే మహిళలు 10 రెట్లు ఎక్కువగా సారీ చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికి సారీ చెప్పాల్సిన అవసరం లేదు. తమను తాము తగ్గించుకోవడం ఆపాలి. ఇక మూవీ ఇండస్ట్రీలో లేడీ యాక్టర్లు గుర్తింపునకు రెట్టింపు కష్టపడాల్సి వస్తోంది. లేడీ ఓరియంటెడ్ మూవీలను రిస్క్‌లాగా చూడటం ఆపాలి.

- నటి సమంత

ప్రాంతీయం

రత్నాకర్ బ్యాంక్‌లో ఘరానా మోసం

- రూ. 138 కోట్ల గోల్‌మాల్.. 13 మంది అరెస్ట్
- 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' ఎఫెక్ట్
- భారీ సైబర్ ముఠా గుట్టు రట్టు

ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, మార్చి 27: సైబర్ నేరాలకు ఊతమిచ్చే 'మ్యూల్ బ్యాంక్ ఖాతాల' నెట్‌వర్క్‌పై కరీంనగర్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0'లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక దర్యాప్తులో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు అయింది. మొత్తం 24 మంది నిందితులను గుర్తించగా, వారిలో 13 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ఈ ముఠా ద్వారా సుమారు రూ.138 కోట్లకు పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్ (RBL) సహా పలు వర్చువల్ ఖాతాల ద్వారా ఈ మోసాలు జరిగినట్లు గుర్తించారు. నిందితులపై భారత న్యాయ సంహిత సెక్షన్ 112, 318(4), ఐటీ యాక్ట్ సెక్షన్ 66D కింద కేసులు నమోదు చేశారు. ఈ ముఠా పక్కా ప్రణాళికతో పనిచేస్తోంది. సమన్వయకర్తలు మొత్తం ఆపరేషన్‌ను నియంత్రిస్తారు. మధ్యవర్తులు అమాయక ప్రజలను డబ్బు ఆశ చూపి వారి పేర్లతో బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తారుఆ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగిస్తారుఈ ఖాతాల ద్వారానే మోసపూరిత సొమ్మును దేశ విదేశాలకు మళ్లిస్తారు. అరెస్టయిన వారిలో బండారి సాయిరాం, అనుమాండ్ల రంజిత్, అలిగేటి మల్లేశం, బోగ రాకేష్, బండి ప్రణయ్, భువనగిరి కళ్యాణ్ (బ్యాంక్ మేనేజర్), అయేషా బేగం, విభూది రాంకుమార్, నతర్ల శ్రీనివాస్, కర్రే రాజు, కల్లెడ మహేందర్, కొంద్ర నరహరి, కల్లెడ రాజేష్ తదితరులు ఉన్నారు.వీరు వర్చువల్ ఖాతాల ద్వారా ₹ 12.25 కోట్లు, ఆర్ బీ ఎల్ మ్యూల్ ఖాతాల ద్వారా ₹ 125.80 కోట్లు, మొత్తం: సుమారు ₹ 138 కోట్ల లావాదేవీల్లో గోల్‌మాల్ కు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా నిందితులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలను అప్రమత్తం చేశారు. చిన్న కమిషన్ కోసం మీ బ్యాంక్ ఖాతాలు, ఎటిఎం కార్డులు లేదా లాగిన్ వివరాలు ఇతరులకు ఇవ్వవదని తెలిపారు. ఇతరుల పేర్లతో ఖాతాలు తెరవడంలో సహకరిస్తే మీరు కూడా నేరస్థులే అవుతారని గుర్తించాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఈ సందర్భంగా సీపీ తెలిపారు.

శ్రీరామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 27 : నిజామాబాద్ ఖిల్లా రామాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ దంపతులు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ దంపతులు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. శ్రీ రాములోరి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీరితో పాటు నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి రమేష్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ దంపతులకు మంగళ వాయిద్యాలతో, పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

వేములవాడలో రాములోరి పెళ్లి

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, మార్చి 27 : శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడాలి, పంటలు పండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. శ్రీ రామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజి వద్ద శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రబీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించామని తెలిపారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజీ వద్ద శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణం సంప్రదాయంగా వస్తుందని వివరించారు. కల్యాణానికి 50వేల భక్తులు వస్తారనే అంచనా మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. పందిళ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. నూతన వేదిక వద్ద శ్రీ శివ, శ్రీ సీతారాముల కల్యాణం వేడుకలు దేవాదాయ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. శ్రీ సీతారాముల ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

శ్రీరామ నవమిలో ఎమ్మెల్యే పోచారం దంపతులు

ప్రతిపక్షం, బాన్సువాడ, మార్చి 27: బాన్సువాడ పట్టణం, రూరల్ మండలాలలో శ్రీ రామ నవమి సందర్భంగా పలు ఆలయాలలో శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పుష్ప దంపతులు పాల్గొని స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన వెంట పోచారం శంభురెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి ఉన్నారు. అలాగే బాన్సువాడ రూరల్ మండలం పోచారం, కొల్లూరు, తీర్మలాపూర్, బాన్సువాడ పట్టణంలోని శ్రీరామ కాలనీ, కోటగిరి మండలం కోటగిరి (మీర్జపూర్), ఎక్లాస్ పూర్ క్యాంప్, బీర్కూర్ మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీ సీతరాముల వారిని దర్శించుకున్నారు. ఈ కళ్యాణ మహోత్సవం లో ప్రజాప్రతినిధులు, నాయకులు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో శ్రీరామనవమి వేడుకలు

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం

ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, మార్చి 27 : ఇల్లందకుంటలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే, పొన్నం సత్తయ్య పేరుతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్, ఇతర ప్రముఖ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ - ఇల్లందకుంట శ్రీ సీతారామస్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండాలని... ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

బీఎస్టీ ఆధ్వర్యంలో స్వామి రాందేవ్ జీ మహారాజ్ 32వ సన్యాస దీక్షా దివస్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 27 : భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ (బీఎస్టీ) ఆధ్వర్యంలో శ్రీరామనవమి యోగ ఋషి స్వామి రాందేవ్ జీ మహారాజ్ 32వ సన్యాస దీక్ష దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూరు నగరంలోని శ్రీనగర్ కాలనీ భారత్ స్వాభిమాన్ కార్యాలయంలో సభ్యులు యజ్ఞము, విశేష కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ జిల్లా ప్రభారీ గంజి సాయన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంజనీర్ గంగాధర్, పతంజలి జిల్లా అధ్యక్షుడు తొర్తి బుచ్చన్న, మంకాల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ ఆర్య, యజ్ఞ ప్రభారీ వేదమిత్ర, సోషల్ మీడియా జిల్లా ప్రభారీ ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యాలయ ప్రభారీ కే భరత్, ఉపాధ్యక్షులు పూదరి అరవింద్, ప్రసన్నకుమార్, సంతోష్, గంగాధర్, నారాయణ, జయ ప్రకాష్, దేవ శర్మ, భూమేశ్వర్, సందీప్, మేఘన, మాధవి, లిఖిత, పతంజలి యోగ పరివార గౌరవ సభ్యులు పాల్గొన్నారు.

కుచనపల్లిలో 'సురక్ష నేత్రం'

- సీసీ కెమెరాలు ప్రారంభించిన ఏసీపీ సదానందం

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 27: 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ మండలం కుచనపల్లి గ్రామంలో నిఘా నేత్రాలు కొలువుదీరాయి. గ్రామస్తుల స్వచ్ఛంద సహకారంతో ఏర్పాటు చేసిన సోలార్ ట్రై యాంగిల్ సీసీ కెమెరాలను హుస్నాబాద్ ఏసీపీ సదానందం శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామంలో భద్రతను పెంపొందించేందుకు గ్రామస్తులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులతో చేతులు కలపడం అభినందనీయమన్నారు. గ్రామాల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించి, పట్టుకోవడానికి ఈ నిఘా నేత్రాలు పోలీసులకు మూడో కన్నులా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి గ్రామం ఈ స్ఫూర్తితో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి, వీపీఓ కుమార్, గ్రామ సర్పంచ్ మడప పద్మ జయపాల్ రెడ్డి, కుచనపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ప్రజలు ఆరోగ్యం, ఐశ్వర్యాలతో ఉండాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి 27 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ప్రజలందరూ ఆయువు ఆరోగ్య ఐశ్వర్యాలతో చల్లగా ఉండాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు. శుక్రవారం ఆయన సీతారామ కళ్యాణం ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏటా సీతారామ కళ్యాణం భక్తులు భక్తి శ్రద్ధతో జరుపుకుంటారని అన్నారు. ప్రజలను భగవంతుడు చల్లగా చూడాలని ఆకాక్షించారు. మంచిర్యాల డివిజన్లో పలు ప్రాంతాలలో సీతారామ కళ్యాణం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు చరణ్, మేయర్ ధరణి మధు, కార్పొరేటర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ఎంపీ వంశీకృష్ణ ఆందోళన

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి 27: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం ధరలు పెరుగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం సరియైన నిర్ణయాలు తీసుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువ గా ఉన్నప్పటికీని దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు అధికంగా ఉండటం సాధారణ ప్రజలపై భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ కు 50 నుండి 60 డాలర్ల మధ్య ఉన్న సమయంలో కూడా పెట్రోల్ ధర లీటరుకు రూపాయలు 100 వరకు పెరగడం అన్యాయం అని విమర్శించారు. ఈ కాలంలో ప్రభుత్వం సుమారు రూపాయలు 25 నుండి రూపాయలు 30 లక్షల కోట్ల వరకు పన్నుల రూపంలో వసూలు చేసిందని, ఆ డబ్బు ఎక్కడ వినియోగించబడ్డదో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎల్పీజీ గ్యాస్ కొరతపై వస్తున్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దేశంలో కేవలం ఒక నెలకు సరిపడే గ్యాస్ నిల్వలు మాత్రమే ఉన్నాయని వార్తలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ సహా తెలంగాణలో పెట్రోల్ బంకుల వద్ద పెద్ద ఎత్తున ప్రజల చేరటం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయని వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజల్లో నమ్మకం కల్పించాలని అన్నారు. ప్రజలను పానిక్ మూడ్ లోకి నెట్టే విధంగా పరిస్థితులు మారకూడదని, సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి ఇందన ధరలను తగ్గించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కోరారు.

ఐపీఎల్-2026లో సీఎస్కే లెజెండ్ ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడొద్దు. ధోనీ ప్లేయింగ్-11లోనే ఉండాలి. 3 నెలల నుంచి ఐపీఎల్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆడగలననే నమ్మకం ఉంది కాబట్టే అలా చేశారు. ఒకవేళ తుది జట్టులో లేకపోతే టోర్నీ మొత్తానికే ఆడకూడదు. ఫీల్డ్‌లో ఉంటే కెప్టెన్ రుతురాజ్‌కు సపోర్ట్ ఇస్తారు. ఒకవేళ ధోనీకి ఆడాలని లేకపోతే రిటైర్ అవుతారు.

- మాజీ క్రికెటర్ అశ్విన్

కమనీయం.. సీతారాముల కళ్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే రోహిత్ రావు
- కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మ దంపతులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 27: మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అభిజిత్ లగ్నంలో సంప్రదాయబద్ధంగా జగదభిరాముడి పెళ్లి తంతును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.సుమారు రెండు గంటల పాటు కొనసాగిన ఈ కళ్యాణ మహోత్సవానికి పట్టణ ప్రజలతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.ఆలయంలోని కళ్యాణ మండపం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో కూర్చొని భక్తులు కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.శ్రీ సీతారాముల కళ్యాణాన్ని దర్శించిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులు రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆయన గుణగణాలను అందరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ప్రభుత్వం పేద ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు,మాయ గంగామణి మల్లేశం,స్వరూప, లలితమ్మ, దీపక్ కుమార్,హరిత,రాజశేఖర్,మాజీ మున్సిపల్ చైర్మన్ అరేళ్ళ.మల్లికార్జున్ గౌడ్,బిఆర్ ఎస్ పట్టణ పార్టీ కన్వీనర్ గడ్డమీద కృష్ణ గౌడ్,మాజీ కౌన్సిలర్లు ఆర్కే. శ్రీనివాస్ మాయ మల్లేశం, న్యాయవాది జీవన్ రావు బిఆర్ఎస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు



ఆవుసులపల్లిలో ఆలయాలపై దుండగుల దాడి

- విగ్రహాల ధ్వంసం వెండి ఆభరణాలు, నగదు చోరీ

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చి 27: మెదక్ పట్టణం రెండో వార్డ్‌లోని ఆవుసులపల్లిలో ఉన్న పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి, మల్లన్న ఆలయాల్లో గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. ఆలయాల తాళాలు పగల గొట్టి పెద్దమ్మ తల్లి ఆలయంలోని వెండి కళ్ళు, మెట్టెలు, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న పుట్ట ఎల్లమ్మ విగ్రహం, మాతమ్మ విగ్రహాలను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఇలాంటి అనాగరిక చర్యలకు పాల్పడిన దుండగులపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మెదక్ రూరల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మూడు ఆలయాల్లో చోరీ చేసి విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను త్వరగా పట్టుకుని కఠిన శిక్ష విధించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఖిల్లా రామాలయంలో కవిత పూజలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 27 : జిల్లా కేంద్రంలోని శ్రీ రఘునాథ ఆలయం (ఖిల్లా రాంమందిర్) లో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో కల్వకుంట్ల కవిత దేవనపల్లి అనిల్ దంపతులు పాల్గొన్నారు. శ్రీ సీతారాముల కళ్యాణానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు కవిత దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా కవిత దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికగా అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కవిత దంపతులు సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

సలేంద్రి శివాలయంలో సీతారాముల కళ్యాణం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 27: సలేంద్రి గ్రామంలోని శివాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుడిగంటి సంగీత్ శర్మ వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పానుగంటి నరసింహ చారి మాట్లాడుతూ... గత 18 సంవత్సరాలుగా ప్రతి ఏడాది శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివకేశవుల అనుగ్రహంతో ఈ ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కరువు లేకుండా ఉండాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి సంవత్సరం భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందుతున్నారని పేర్కొన్నారు.మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కార్యక్రమానికి హాజరు కాలేకపోయినా, తమ తరఫున ముత్యాల తలంబ్రాలను పంపించారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పానుగంటి రమేష్, బండారి శ్రీనివాస్ (హైదరాబాద్), మెట్టుపల్లి గ్రామ సర్పంచ్ ధర్మాజీ పేట తిరుపతి రెడ్డి, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొత్త శంకర్, కాముని శ్రీనివాస్, కాల్వ ఎల్లం, కోరబోయిన పెద్ద రాజు, కొత్త రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 27 : ఆదర్శమూర్తి శ్రీరామున్నిఆదర్శంగా తీసుకోవాలని నిజామాబాద్ రూరల్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి అన్నారు. మండలంలోని బోర్గాం లో ధర్మరక్షణ సేనా ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రముఖ సాయి బాబా ఆలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలు సాయిబాబా జన్మదిన వేడుకలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శ్రీరాముడి చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి శోభాయాత్రను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శమూర్తులు శ్రీరాముడి జీవితం నేటితరానికి ఆదర్శమన్నారు. యువకులు రాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సాయిబాబా ఆలయం ఈవో రవీందర్ గుప్తా, సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపల్లి సాయి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ధర్మరక్ష సేన నాయకులు సోమరాజు బుషి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో ఘనంగా శ్రీరామనవమి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 27: నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం, సారంగాపూర్, తీర్మన్ పల్లి శ్రీనగర్ తదితర పలు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు కళ్యాణ మహోత్సవం ఘట్టాలు ఘనంగా జరిగాయి.తీర్మన్ పల్లి గ్రామంలోని రామాలయంలో అర్చకులు సతీష్ జోషి శ్రీరాముడి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసీ చైర్మన్, ఉప సర్పంచ్ శ్యామ్ ప్రసాద్, ఓశన్న, వంశీ, ప్రదీప్, గైని శ్రీను, బాలయ్య, సాయిలు పాల్గొన్నారు. గుండారం గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీరాముడు కళ్యాణ మహోత్సవం జరిగింది. గ్రామ సర్పంచ్ అంకల గంగాధర్, ఉపసర్పంచ్, వీడీసీ చైర్మన్ సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సారంగాపూర్ లో రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద్ అన్న కార్యక్రమాలు నిర్వహించారు.

సిద్దిపేటలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 27: శ్రీరామ నవమి సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గంలో భక్తి వాతావరణం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తరఫున నియోజకవర్గంలోని సుమారు 60 దేవాలయాలకు శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవం కోసం ఫల పుష్పాలు కానుకగా పంపిణీ చేశారు. పట్టణంలోని 30 ఆలయాలకు, గ్రామీణ మండలాల పరిధిలోని మరో 30 ఆలయాలకు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు ఈ కానుకలను సమర్పించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా, రామనామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.సిద్దిపేట పట్టణంలోని రామాలయం, పంచముఖ హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం, శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాల సాయిరాం, యువజన నాయకుడు రెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో కూడా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా ఫల పుష్పాలను అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఇతర నాయకులు, సర్పంచులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఫల పుష్పాలను ఆలయాలకు సమర్పించారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కందుల పండుగలా సీతారాముల కళ్యాణం

- ర్యాలమడుగులో భక్తి శ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహణ



ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 27: మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమాన్ దేవాలయం హనుమాన్ సేవ సమితి సభ్యులు గ్రామస్తుల సహకారంతో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా, కందుల పండుగలా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని,దేవాలయ పరిసరాలు పూలతో,తోరణాలతో అందంగా అలంకరించారు. మంగళ వాద్యాల నాదం, వేద మంత్రోచ్చారణల మధ్య కళ్యాణ కార్యక్రమం భక్తి పారవశ్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా పూజారులు సంప్రదాయ పద్ధతిలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించగా,గ్రామస్తులు, భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.కళ్యాణ వేడుకలో భాగంగా తాళంబ్రాలు, అక్షింతలు కార్యక్రమాలు భక్తుల సమక్షంలో నిర్వహించబడగా,దేవాలయం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. కళ్యాణం అనంతరం భక్తులు సీతారామచంద్రస్వామికి ఒడు బియ్యం సమర్పించి తమ భక్తి భావాన్ని వ్యక్తం చేశారు.మొక్కులు తీర్చుకున్న వారు ప్రత్యేక హారతులు,సేవలు సమర్పించారు. చిన్నపిల్లలు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకకు మరింత అందాన్ని తీసుకువచ్చారు.గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు నిరంతరంగా ప్రసాదం పంపిణీ చేయబడగా,వందలాది మంది భక్తులు పాల్గొని భోజనాన్ని స్వీకరించారు. గ్రామ యువత, అన్నదాన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సేవా భావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమం గ్రామస్తుల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. భక్తి, ఆనందం, ఆధ్యాత్మికత కలిసిన ఈ సీతారాముల కళ్యాణం ర్యాలమడుగు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి,పాల్గొన్న ప్రతి ఒక్కరికి మరపురాని అనుభూతిని కలిగించింది.

సిద్దిపేట నియోజకవర్గంలో కుంటల పునరుద్ధరణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట మార్చి 27: సిద్దిపేట నియోజకవర్గంలోని రూరల్ మండలం రాఘవాపూర్ ఇంద్రగూడెం గ్రామంలో పల్లె కుంట, మొండి కుంటల పునరుద్ధరణకు రూ. 48.20 లక్షలు కేటాయించినందుకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన ఈ చర్యపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కేసీఆర్, హరీష్ రావు ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, సర్పంచ్ గ్యార పద్మ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎర్వ రమేష్ సహా పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. కంతుల రాజు, కంతుల స్వామి, సంపంగి తిరుపతి, కంతుల సత్యనారాయణ, సంపంగి శ్రీకాంత్, పిట్ల పోచయ్య, పుల్లూరు కనకరాజు, గ్యార సురేష్, గ్యార రవి, జంగు మల్లేశం, గ్యార బాలరాజు, బోస్ల వెంకట్, దగ్గుల శ్రీనివాస్, కంతుల కనకయ్య, అబ్బుల దేవయ్య, పిట్ల నరసింహులు, కంతుల అంజయ్య, జంగు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడంపై భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఎన్నికల వరకేనా లేక కొనసాగుతుందా? గతంలో అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని ప్రజలకు ఎందుకు చేకూర్చలేదు. ఇంధన ధరలు మార్కెట్ పరిస్థితుల కంటే ఎన్నికలపై ఆధారపడ్డాయి.

- జర్నలిస్ట్ రాజ్‌దీప్

చందాపూర్ లో ఘనంగా శ్రీ రామ కళ్యాణ మహోత్సవం!

ప్రతిపక్షం, సిద్దిపేట, మార్చి 27: పరమ పవిత్రమైన శ్రీరామ నవమి మహోత్సవం సందర్భంగా చందాపూర్ సర్పంచ్ చందా లావణ్య స్వామి ఆధ్వర్యంలో శ్రీ రామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు..చందాపూర్ గ్రామంలో ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద వేడుకలు నిర్వహించడం జరిగింది....సర్పంచ్ చంద లావణ్య స్వామి మాట్లాడుతూ, ధర్మం, న్యాయం, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన శ్రీరామచంద్ర ప్రభువు ప్రజలందరికీ ఆదర్శ పురుషుడని పేర్కొన్నారు. ఆ ధర్మస్వరూపుడు చూపిన మార్గంలో నడుస్తూ, మన జీవితాల్లో సత్యం, సహనం, కర్తవ్యబద్ధతను అలవర్చుకుని ఆదర్శ జీవితం గడపాలని కోరారు. శ్రీరామచంద్రుని కృపాకటాక్షాల తో ఈ పవిత్రమైన శ్రీరామనవమి మహోత్సవం మన చందాపూర్ గ్రామం లోఅందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్మకూరి శ్రీకాంత్ యాదవ్ , మరియు గ్రామ యువకులు , గ్రామ పెద్దలు తదితరు పాల్గొన్నారు.

డొమెస్టిక్ సిలిండర్ల అక్రమ వినియోగం

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 27: మున్సిపల్ పరిధిలో గృహ వినియోగ అవసరాలకు (డొమెస్టిక్) వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాల కోసం యధేచ్ఛగా వినియోగిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాల్సి ఉండగా, అధిక లాభాల కోసం చాలా మంది యజమానులు డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్నారు. నిత్యావసరంగా ఉండాల్సిన గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లలో వాడటం వల్ల సామాన్య ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడుతోంది. బుక్ చేసుకున్న సకాలంలో సిలిండర్లు అందక గృహిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "రీ ఫీలింగ్" పేరుతో పట్టణంలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్యపరంగా వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సామాన్యులకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా సీతారాముల కళ్యాణం

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 27: సీతారాముల కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని హనుమాన్ ఆలయాల్లో రామాలయాల్లో ఘనంగా నిర్వహించారు. చేగుంట నార్సింగ్ వెల్దుర్తి తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో అత్యంత వైభవంగా వేదమంత్రోత్సవాల మధ్య కళ్యాణం నిర్వహించారు. పుస్తే మట్టల మట్టెలు తలంబ్రాలు దాతలు బహుకరించారు. చేగుంట మండలం కర్నాల్ పల్లి సాయిబాబా ఆలయం చేగుంట మండల కేంద్రంలో రాధాకృష్ణశర్మ ఆలయంలో సీతారామ కాలనీలో రాంపూర్ హనుమాన్ ఆలయంలో కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. నార్సింగి రాములవారు ఆలయంలో కళ్యాణోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. తూప్రాన్ రామాలయంలో మనోహరాబాద్ హనుమాన్ ఆలయంలో చేపట్టారు. పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచులు ఉపసర్పంచులు గ్రామ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గరికపాటి 'పద్మశ్రీ'ని వెనక్కి తీసుకోవాలి

- పేద విధ్యార్థులను విద్యకు దూరం చేసేందుకే గరికపాటి కుట్ర
- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 27: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద మధ్యతరగతి విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంపై చులకనగా మాట్లాడుతున్న పద్మశ్రీ గరికపాటి నరసింహ రావు కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మశ్రీ' అవార్డును వెనక్కు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ పేద విద్యార్థుల పట్ల అత్యంత దురుసుగా, అవమానకరంగా, బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంలో భాగంగా మధ్యాహ్న భోజనం, గుడ్డు ఇస్తున్న నేపథ్యంలో గరికపాటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజ ద్రోహం కేసు పై గరికపాటిని అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని, గరికపాటి వాక్యాలు పేద విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు కుట్రలో భాగమన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

కోర్టుల చుట్టూ తిరుగుడు కాదు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోండి

- గజ్వేల్ ఏసిపి నర్సింలు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 27: చిన్న చిన్న కంపొండబుల్ కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్ష దారులకు ''లోక్ అదాలత్'' మంచి అవకాశం అని గజ్వేల్ డివిజన్ ఏసిపి నర్సింలు పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజీ పడదగిన కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఉన్న నిందితులు, ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్నిసంప్రదించి రాజీ పడవచ్చని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని, రాజీ మార్గం ద్వారానే సమస్యలను త్వరగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. జుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో లోక్ అదాలత్ సందర్భంగా తక్కువ జరిమానాతో పరిష్కారం పొందే అవకాశం ఉన్నందున, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

కనుల పండుగగా శ్రీరామ కళ్యాణోత్సవం

ప్రతిపక్షం, గజ్వేల్, జూన్ 27: నియోజకవర్గంలోని పేరుగాంచిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంతోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నాడు శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కళ్యాణం మహోత్సవాలు కనుల పండుగగా, వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ఉపాలయాలలో ఒకటైన రామాలయం నందు శ్రీరామనవమి పురస్కరించుకుని ఎదుర్కోలు మహోత్సవంతో పాటు సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వేదమంత్రోచ్చరణల మధ్య కనుల పండగ నిర్వహించారు. అలాగే గజ్వేల్ మండలం జిల్లా దిలాల్పూర్, మర్కుక్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్ పట్టణ కేంద్రంలోని రామాలయం, శిరిడి సాయిబాబా మందిరం తదితర దేవాలయాల్లో కళ్యాణోత్సవాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో నాచగిరి ఆలయ చైర్మన్ పి రవీందర్ గుప్తా, కార్య నిర్వహణ అధికారి బెల్లంకొండ రంగాచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి తోపాటు పలు దేవాలయాల పాలకమండలి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్య ,కర్రె పద్మ వెంకటేష్, శేఖర్ గుప్తా, నాచారం సర్పంచ్ సారిక యాదగిరి, సిబ్బంది మరియు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా శ్రీ సీతారాముల కళ్యాణం

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 27: తొగుటరాంపూర్ లోని గురు మదనానంద శారదా పీఠం ఆవరణం శ్రీ రామనామ స్మరణతో మార్మోగింది.. శ్రీ రామనవమి ని పురస్కరించుకొని , శ్రీ గురు మాధవానంద సరస్వతి స్వామి వారి దివ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రీ రామ నవమి పర్వదినాన జరిగిన ఈ మహోత్సవం భక్తి, శ్రద్ధ, సంప్రదాయం, సంస్కృతుల సమ్మేళనంగా కళకళలాడుతూ, ప్రతి భక్తుని హృదయాన్ని ఆధ్యాత్మికానందంతో నింపింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నాదం మధ్య శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం జరిగింది. ఈ దివ్య కళ్యాణ మహోత్సవం కేవలం ఒక ఆచారం కాదు... మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించే ఆధ్యాత్మిక ఉత్సవమని పేర్కొన్నారు. భక్తులలో భక్తి, నైతిక విలువలు,ధర్మబద్ధత పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు.. కార్యక్రమం లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సీతా రాముల చిత్రం ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 27: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో సీతారాముల చిత్రాన్ని చిత్రించిన అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం లాంఛనంగా ఆవిష్కరించారు. పురుషోత్తముడు రాముడుసీత జీవితం ఎందరికో మార్గదర్శం కావాలని యువజంటలు వారిని ఆదర్శంగా తీసుకోవాలని మానవతా చిత్రకారులు రుస్తుం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అందరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఆర్ ఏ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతా కోదండరామ కళ్యాణం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చి 27: శ్రీరామనవమిని పురస్కరించుకుని సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్ పల్లి, మిట్టపల్లి, పొన్నాల గ్రామాలలో సీతారాముల కళ్యాణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏన్సాన్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని మూడు రోజులు ఘనంగా నిర్వహించి శుక్రవారం నవమి రోజున కళ్యాణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు గ్రామంలో పెద్ద ఎత్తున భక్తులు కళ్యాణోత్సవానికి హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. 19 జంటలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్, చింతల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లం,బిఆర్ఎస్ నాయకులు భూసాని శ్రీనివాస్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్య పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందించాలి

- లేదంటే రోడ్డుపై బైఠాయించడానికి సిద్ధం
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 27: రైతులకు మరియు గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని కోరుతూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ నేతృత్వంలో అహ్మదీపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులతో కలిసి విద్యుత్ మండల అధికారికి శుక్రవారం నాడు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా లో వోల్టేజ్ వల్ల రైతులకు యసంగి పంట సీజన్ కావడం బావుల వద్ద మోటార్లు, కలిపోవడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా నిత్యం గృవసరాలకు వినియోంగించే కరెంట్ వల్ల కూడా సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. వెంటనే లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించని తరుణంలో రైతులు మరియు ప్రజలతో కలిసి రోడ్డు మీద బైఠాయించడం జరుగుతుంది అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు ప్రజలకు సంతృప్తిని ఇవ్వడం కోసం కేసీఆర్ సర్కారు పని చేస్తే నేడు నేడు మళ్ళీ కరెంట్ కష్టాలు రావడం జరుగుతుంది అన్నారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా విద్యుత్ వాడటం తెలియకపోవడంతో ఇటువంటి సమస్యలు వస్తున్నాయని వెంటనే ప్రభుత్వం చొరవ చూపి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు సంపత్ రెడ్డి, కుర్మ రాములు, రాజు, రాములు, మహిపాల్ రెడ్డి, వెంకట్ గౌడ్, రైతులు సకలి శ్రీను, కిష్టారెడ్డి, రాములు గౌడ్, రాజిరెడ్డి, బాలయ్య, నరేష్, రమేష్, కార్నకర్ రెడ్డి, కొండల్ రెడ్డి సత్యపాల్ ,యాదయ్య, స్వామిరెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో అధికార దుర్వినియోగం

- కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు
- ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ చర్యలు
- ప్రజల సమస్యలపై ఉద్యమాలకు బీఆర్ఎస్ సిద్ధం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 27: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి, చౌదరి. సుప్రభాత్ రావు,మున్సిపల్ కౌన్సిలర్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...అభివృద్ధి పేరిట రాజకీయ కుతంత్రాలకు పాల్పడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన ప్రజా ప్రతినిధులను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.రామాయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, కౌన్సిలర్లను డబ్బులు, పదవుల వాగ్దానాలతో ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచే విధంగా ఈ చర్యలు కొనసాగుతున్నాయని,ఇటువంటి రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు.రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధి కేవలం మాటల్లోనే పరిమితమైందని, నేలమీద ఎక్కడా కనబడడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని, రైతులు, నిరుద్యోగులు, పేదల సమస్యలు పరిష్కారం కాని స్థితిలోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు బయట పెడుతుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.మా పార్టీ కౌన్సిలర్లను, ప్రజాప్రతినిధులను భయపెట్టి ఇబ్బందులకు గురిచేస్తూ, అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పించడం దురదృష్టకరం. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం. మీరు నిజంగా ప్రజల కోసం పనిచేయాలనుకుంటే, రాజకీయ ప్రలోభాలు, బెదిరింపులు పక్కనబెట్టి అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని హెచ్చరించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ చౌదరి.చరిత,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరల పెరుగుదల నుంచి వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం. అలాగే డీజిల్ ఎగుమతులపై లీటర్‌కు 21.5, జెట్ ఫ్యూయల్ ఎగుమతులపై లీటర్‌కు 29.5 చొప్పున సుంకాలు విధిస్తున్నాం. దీని వల్ల చమురు కంపెనీలు తమ ఉత్పత్తిని అంతర్జాతీయ మార్కెట్‌కు అమ్ముకోకుండా దేశీయ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తాయి.

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

వైభవంగా సీతారాముల కల్యాణం

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 27: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. ఈ వేడుకలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు పాల్గొని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, హుస్నాబాద్ మండల పద్మశాలి సేవా సంఘ సభ్యులు, ఆలయ కమిటీ అధ్యక్షులు వెల్దండి లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి అరుణ, వడ్డేపల్లి లక్ష్మయ్య, కోశాధికారి పంతం కన్యాకుమారి, మాజీ ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష పార్టీ నాయకులు,పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

శివాజీ నగర్లో..

హుస్నాబాద్ పట్టణంలోని శివాజీ నగర్ హనుమాన్ దేవస్థానంలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించిన ఈ సీతారామ కళ్యాణం కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, మాజీ వైస్ చైర్మన్ ఐలేని అనిత, కౌన్సిలర్ గోపగోని శోభన్ బాబు, శివాజీ నగర్ కమిటీ సభ్యులు ఐలేని శంకర్ రెడ్డి, కొమురెల్లి రవీందర్, పచ్చిమట్ల రవీందర్, మాధవరెడ్డి, రోహన్, పవన్ శర్మ తదితరులు హాజరయ్యారు.

పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుపై

పూర్తి నిషేధం విధించాలి

- గడ్డి మందు పర్యావరణం, ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం
- లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 27: దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) అనే అత్యంత ప్రమాదకర హెర్బిసైడ్‌పై తక్షణమే పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని, దీని ప్రభావం వ్యవసాయ వ్యవస్థలపై తీవ్రమవుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పుగా మారిందని హెచ్చరించారు. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ రసాయనం గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు మరణాయుధం గా మారిందని ఎంపీ పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తున్నాయని, దీనికి ఇప్పటివరకు సమర్థవంతమైన యాంటిడోట్ లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని అన్నారు తెలంగాణలోని వరంగల్ సహా పలు జిల్లాల్లో ఇది ఆత్మహత్యలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రమాదకర సాధనంగా మారిందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, పర్యావరణం, సామాన్య ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) తయారీ, విక్రయం, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ తెలంగాణ సహా పలువురు వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు కూడా ఇదే అంశంపై ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ నిషేధంt కోసం ఒత్తిడి తెస్తున్నారని ఎంపీ గుర్తుచేశారు. ప్రమాదకర రసాయనాలకు బదులుగా సురక్షిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

శ్రీరామనవమి వేడుకల్లో పరమేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం, ఉప్పల్, మార్చి 27: ఉప్పల్ నియోజకవర్గం రామంతాపూర్, వెంకట్ రెడ్డి నగర్, బీరప్ప గడ్డ, హబ్సిగూడ, ఉప్పల్ డివిజన్లో శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముల కల్యాణమహోత్సవంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డికి ఆలయ అర్చకులు ప్రత్యేక స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పత్తిపాకలో విషాదానికి

బోర్ బ్లాస్టింగ్ లే కారణమా!?

- కోతులు వెంటపడ్డంతో దాబా పైనుండి కిందపడి వ్యక్తి మృతి
- క్రషర్లతో ధ్వంసమవుతున్న గుట్టలు
- గ్రామాలు, పంటచేల్లపై దాడి చేస్తున్న వన్య ప్రాణులు

ప్రతిపక్షం, పరకాల, మార్చి 27 : హనుమకొండ జిల్లా శాయంపేట మండల పరిధిలోని పత్తిపాక గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోతుల గుంపు వెంటాడటంతో ప్రాణాలు రక్షించుకునే క్రమంలో ఓ వ్యక్తి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందటంతో ఒక్కసారిగా ఆ గ్రామం ఉలిక్కిపడింది. ఈ ఘటనతో శ్రీరామ నవమి వేళ పత్తిపాక గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్ళితే పత్తిపాక గ్రామానికి చెందిన తడుక కర్ణాకర్ (ఎల్ఐసి) ఏజెంట్ దైనందిన కార్యక్రమాల్లో భాగంగా తన ఇంటి భవనంపై ఉన్న కర్ణాకర్ ను కోతుల గుంపు దాడికి యత్నించించగా వాటి నుండి తప్పించుకునే క్రమంలో కాలు జారి భవనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

బాంబు పేలుళ్లే కారణమా?

గ్రామ సమీపంలోని కొండల్లో యథేచ్ఛగా సాగుతున్న క్వారీ బ్లాస్టింగ్ (బాంబు పేలుళ్లు) వల్లే ఈ అనర్థం జరిగిందని పలువురు గ్రామస్తులు భావిస్తున్నారు. భారీ శబ్దాలతో పేలుళ్లు జరుగటం వల్ల ఆ ప్రాంత గుట్టల్లో ఉండాల్సిన కోతులు వన్యప్రాణులు, అడవి పందులు భయాందోళనకు గురై జనావాసాల్లోకి వస్తున్నాయి. పత్తిపాక క్రషర్ల నిర్వహణలో నిబంధనలు గాలికొదిలేయడం వల్లే నేడు ఒక నిండు ప్రాణం బలి అయ్యిందని పలువురు స్థానికులు భావిస్తున్నారు.

క్రషర్లతో ప్రకృతి ధ్వంసం.. వన్యప్రాణుల వలస

పర్యావరణాన్ని విస్మరించి సాగిస్తున్న ప్రకృతి విధ్వంసం ఇప్పుడు ప్రాణాల మీదకు వస్తోంది. అడ్డగోలుగా కొండలను పిండి చేస్తుండటంతో వన్యప్రాణులు తమ నివాసాలను కోల్పోతున్నాయి. అడవిని వదిలి గ్రామాల్లోకి వస్తున్న వన్య ప్రాణులు పంట పొలాలను నాశనం చేయడమే కాకుండా, గ్రామాల్లో ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. నిత్యం కోతులు, ఇతర అడవి జంతువుల సంచారంతో గ్రామస్తులు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న క్రషర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. "అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది" అని వారు వాపోతున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని పత్తిపాక వాసులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

దామెర రాజేందర్, సహజ వనరుల పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు

కోతుల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో భవనం పైనుంచి కిందపడి మృతి చెందిన తడక కరుణాకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. గుట్టల విధ్వంసం కావడమే గ్రామాల్లో కోతులు విచ్చలవిడిగా సంచరించడానికి కారణంగా కనిపిస్తోంది. పత్తిపాక, శాయంపేట చుట్టుపక్కల గ్రామాల్లో విచ్చలవిడిగా క్రషర్ యజమాన్యాలు బోర్ బ్లాస్టింగ్స్ నిర్వహిస్తున్నాయి. గుట్టలు ధ్వంసం కావడం వల్ల కోతులు, అడవి పందులు రకరకాల వన్యప్రాణులు తమ ఆవాసాలు కోల్పోయి జనవాసాల మధ్యకు వస్తున్నాయి. దీంతో ప్రతిరోజు అనేక గ్రామాల్లో కోతుల దాడులు కామన్ గా మారాయి. అలాగే పంటచెల్లను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి.

జాతీయ పక్షి అయిన నెమళ్లు తమ ఆశ్రమం కోల్పోతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి బోర్ బ్లాస్టింగ్స్ నిలిపి వేసి గుట్టల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తడుక కర్ణాకర్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సహజ వనరుల పరిరక్షణ వేదిక ప్రకటిస్తున్నది. మృతుడి కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలి. సీఎం సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందించాలి. కోతుల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలి. గుట్టల విధ్వంసం కాకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

హనుమకొండ హరిత కాకతీయ హోటల్లో భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి విఎల్ కాంతా రావును హనుమకొండలో శుక్రవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు జల వనరుల అభివృద్ధి నీటి సంరక్షణపై చర్చించారు.

- ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ

దేవాదుల పంపు హౌస్ ను పరిశీలించిన

జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావు

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 27: హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్ తోపాటు ధర్మసాగర్ లోని రిజర్వాయర్ సౌత్ మెయిన్ కెనాల్ ను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు సందర్శించారు. దేవన్నపేట పంప్ హౌస్, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్ వివరాలను అధికారులు కేంద్ర జల శక్తిమంత్రిత్వ శాఖ కార్యదర్శి కి వివరించారు ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధికారులను ఆదేశించారుఈ సందర్భంగా రాష్ట్ర ఆర్ అండ్ అర్ కమిషనర్ శివకుమార్ నాయుడు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ కుల్దీప్ సింగ్ సిడబ్ల్యుసి డైరెక్టర్ శ్రీనివాస్ హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి ఇఎన్సీ జనరల్ రమేష్ బాబు చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఇరిగేషన్ ఎస్ ఈ రాం ప్రసాద్ ఈఈలు సీతారాం మంగీలాల్ హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్ జిల్లా సాగునీటిపారుదల శాఖ అధికారి రామ్మోహన్ మెగా ప్రాజెక్టు మేనేజర్ తిరుపతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

హన్మకొండ లో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆమె భర్త టీజీ ఎంపీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ

మఖ్తల్ శ్రీ పడమటి ఆంజనేయ స్వామి

భూముల అన్యాక్రాంతంపై గర్జన

- మీరు జీతాలు తీసుకునేది దేవుడి ఆస్తులు రక్షించడానికా?
- లేక ప్రైవేట్ వ్యక్తులకు దొడ్డిదారిన అప్పగించడానికా?"
- 500 కోట్ల భూమి పోతుంటే నిద్రపోతున్నారా?
- వాకిటి అంజనేయులు ముదిరాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 27: శ్రీరామ నవమి పవిత్ర పర్వదినాన, భక్తాగ్రేసరుడైన ఆంజనేయ స్వామికి చెందిన 500కోట్ల విలువైన ఆస్తులను కొందరు స్వార్థపరులు, అవినీతి అధికారులు కలిసి ప్రైవేట్ వ్యక్తుల పాలు చేస్తున్నారని జ్యోతిరావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపకులు వాకిటి అంజనేయులు ముదిరాజ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. మక్తల్ లోని సర్వే నంబర్ 35లో ఉన్న 8 ఎకరాల 24 గుంటల భూమి స్వామివారి ఆస్తి అని రికార్డులు చెప్తున్నాయన్నారు. కానీ, దేవాదాయ శాఖ ఈవో, జూనియర్ అసిస్టెంట్ మరియు ప్రస్తుత చైర్మన్ ల నిర్లక్ష్యం వల్ల నేడు ఆ భూమి ప్రైవేట్ వ్యక్తుల హస్తగతమైంది. కోర్టులో కనీసం అడ్వకేట్ ఫీజులు చెల్లించకుండా, నోటీసులకు స్పందించకుండా కావాలనే కేసును నీరుగార్చారు. ఇది నిర్లక్ష్యం కాదు.. వందల కోట్ల కుంభకోణమని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మఖ్తల్ తహశీల్దార్ వరకు, ఎంపీ డీకే అరుణమ్మ నుంచి స్థానిక ఎమ్మెల్యే వరకు అందరికీ వినతి పత్రాలు ఇచ్చాం. కానీ, ఒక్క అధికారి కూడా కనీసం విచారణ జరిపిన పాపాన పోలేదని, దేవుడి భూమిని కాపాడలేని ఈ వ్యవస్థ ఎవరి కోసం పనిచేస్తోంది? దేవుడి ఆస్తులు రక్షించాల్సిన అధికారులే భక్షకులుగా మారారని ప్రశ్నించారు. 'రామ్ లీలా మైదానం అద్దెలు, గుడి దుకాణాల కిరాయిలు, భక్తుల కానుకల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తోంది. ఈ డబ్బు అంతా ఎవరి జేబుల్లోకి వెళ్తోంది? గుడి భూముల కోసం కోర్టులో వాదించే లాయర్లకు ఇచ్చేందుకు డబ్బులు లేవా? లేక ప్రైవేట్ వ్యక్తుల దగ్గర ముడుపులు అందుకుని మౌనంగా ఉంటున్నారా' ప్రభుత్వం మేల్కోకపోతే, మఖ్తల్ ప్రజలందరినీ ఏకం చేసి 'చలో దేవాలయం' పిలుపునిస్తామని, దేవుడి భూమిలో అక్రమంగా వేసిన డబ్బాలను భక్తులే తొలగించే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. హనుమంతుడి భూమిని కాజేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని. చట్టపరంగా, ప్రజా క్షేత్రంలో మా పోరాటం చేస్తామన్నారు. అవసరమైతే హైకోర్టులో 'పిల్' వేసి అధికారుల బండారం బయటపెడతమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాగనూరు మండల కన్వీనర్ నజీర్, మఖ్తల్ మున్సిపాలిటీ కురవ అంజి, రాఘవేందర్, భీమేష్, కిజర్ పాల్గొన్నారు.

“

క్రూడాయిల్ ధరలు నెల వ్యవధిలో బ్యారెల్ 70 నుంచి 122 డాలర్ల వరకు పెరిగాయి. దీనివల్ల పలు దేశాల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు 20—-50% పెరిగాయి. అయితే పీఎం మోదీ సామాన్యులపై భారం వేయకూడదని నిర్ణయించారు. ఆయిల్ కంపెనీలకు లీటర్ పెట్రోల్‌పై రూ.24, డీజిల్‌పై రూ.30 మేర వస్తున్న నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ పన్నులపై కోత విధించారు.

- కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్

ప్రాంతీయం

రాయికోడ్‌లో ఘనంగా సీతారాముల కళ్యాణం

ప్రతిపక్షం, మక్తల్, మార్చి 27: రాయికోడ్ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం జరిగింది. ఉత్సవంలో భాగంగా ఉదయం గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా పల్లకి సేవ, అడుగుల భజన, భక్తి పాటలతో ఊరేగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది. అనంతరం ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర మధ్యాహ్నం 12 గం లకు సీతారాముల కళ్యాణంను అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ సీతారాముల కళ్యాణం సందర్భంగా మొదసారి గా తన సొంత గ్రామానికి విచ్చేసి తీర్థ ప్రసాదలు స్వీకరించిన జాతీయ స్థాయి వాలీబాల్ ప్లేయర్ అన్యన్న శ్రీ కి గ్రామ పెద్దల మరియు సర్పంచ్, ఉప సర్పంచ్ లా సమక్షంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు ప్రజలు పాల్గొన్నారు.

యుద్ధం వద్దు - శాంతి ముద్దు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 27 : డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్చెరు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాలలో భాగంగా ఈరోజు దత్తత గ్రామాలైన పోచారం కట్ట పోచారం గ్రామాలలో యుద్ధం వద్దు శాంతి ముద్దు ర్యాలీని నిర్వహించారు. తదుపరి గ్రామవీధులలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఏ విధంగా రోగాల నుండి కాపాడుకోవచ్చు స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామస్తులకు సందేశం ఇచ్చారు 100 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిసరాల పరిశుభ్రత పై సందేశమిచ్చారు. గ్రామస్తులు, పుర ప్రముఖులు వివిధ ఆలయాల వద్ద వాలంటీర్లు చేసిన సేవను గుర్తిస్తూ ఇలాంటి సేవా దృక్పథం నేటి ఆధునిక కాలంలో పిల్లల్లో పెంపొందించడం చాలా సంతోషకరమని కళాశాల ప్రిన్సిపల్ కు మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు ధన్యవాదాలు తెలిపారని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ తెలిపారు. సాయంత్రం వేళలో కళాశాల పూర్వ విద్యార్థులైన రిషికేశ్ సింగ్, జ్ఞానేశ్వర్, రవి, నిఖిల్ ఉస్మానియా యూనివర్సిటీ పీజీ విద్యార్థులు వాలంటీర్లతో ముఖాముఖి చర్చలో కెరియర్ అవకాశాలపై చర్చించారు. అదేవిధంగా కళాశాలలో విద్యార్థుల డ్రాప్ అవుట్ రేట్స్ ను తగ్గించుటకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఈ ఇష్టా గోష్టిలో ముచ్చటించారని ప్రోగ్రాం అధికారులు ప్రొఫెసర్ ఆకుల వెంకటేశం మరియు కరుణ కుమారి తెలిపారు.

ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు

ప్రతి పక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 27 : తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కల్పకూర్, అంగడిపేట గ్రామాలలో 90 మంది విద్యార్థులతో, మల్కాపూర్ గ్రామంలో 45 మంది బాలికలతో కొనసాగుతున్న శిబిరాల మూడవ రోజున స్వచ్ఛత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కల్పకూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం మరియు పరిసర ప్రాంతాలను విద్యార్థులు శుభ్రపరిచారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, దేవాలయం పరిసరాలను పర్వదినానికి అనుగుణంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అలాగే మల్కాపూర్ గ్రామంలో ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేసి పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన పరిసరాల ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత కీలకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత ఎంతో దోహదపడుతుందని, కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల ద్వారా గ్రామాల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి పాల్గొన్నారు. కల్పగూర్‌లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మల్లేష్, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మల్కాపూర్‌లో ఉన్నత పాఠశాల హెచ్ఎం యాదగిరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మరియు గ్రామ పెద్దలు విద్యార్థులకు మద్దతు అందించారు.

శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఇర్షాద్ ఖాన్

ప్రతిపక్షం, ఉప్పల్, మార్చి 27: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బీరప్పగడ్డ డివిజన్‌లోని పలు ఆలయాలలో జరిగిన కార్యక్రమాలలో ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) పాల్గొన్నారు. సీతారామ కాలనీ రామాలయం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అక్కడ జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొని భక్తులతో కలిసి శ్రీరాముని దర్శించుకున్నారు. అలాగే బీరప్పగడ్డ రామాలయం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజలు మరియు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రశాంతి నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై భక్తులకు, కాలనీ వాసులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులను, కాలనీ సభ్యులను కలుసుకుని అందరికీ శ్రీరామ నవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందించాలని ఆకాంక్షించారు.

సంగారెడ్డిలో వైభవంగా సీతారాముల కళ్యాణం

- సీతారాములకు 2కిలోల 250 గ్రాముల బంగారు ఆభరణాలతో అలంకరణ
- 10కిలోల వెండితో ఆదిశేషుడు, కళ్యాణ పీటను చేయించిన జగ్గారెడ్డి
- కళ్యాణ వేడుకలో 3 క్వింటాళ్ల మేలిమి ముత్యాల తలంబ్రాలు సమర్పణ.. అనంతరం భక్తులకు పంపిణీ
- భక్తులతో కిక్కిరిసిన సంగారెడ్డి రామ్ మందిర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 27 : సంగారెడ్డి లోని రామ్ నగర్ రామ్ మందిర్ లో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కళ్యాణం కన్నుల పండువగ జరిగింది. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ వేడుకకు ఘనమైన ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మహోత్సవం కొరకు తాను స్వయంగా చేయించిన 2 కిలోల 250 గ్రాముల బంగారు ఆభరణాలను తన ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు వచ్చారు. ఉదయం సీతా సమేత శ్రీరామచంద్రుడి విగ్రహాలకు అలంకరింప చేశారు. స్వర్ణాభరణాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతున్న సీతారామ చంద్రులను చూసి భక్తులు తన్మయత్వం చెందారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు రామ్ మందిర్ లో భక్తుల రద్దీ కిక్కిరిసింది. భక్తులందరికీ తీర్థం ప్రసాదాలను అందించారు.

వైభవంగా కళ్యాణ వేడుక :

రంగంపేట పీఠాధిపతులు పూజ్యశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పర్యవేక్షణలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి శ్రీ మహేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్చారణలు, డప్పు చప్పుళ్ళ నడుమ భక్తుల అందరి సమక్షంలో కళ్యాణ మంత్రాలు మార్మోగాయి. కళ్యాణ వేడుకలు పుస్తెలతాడు కట్టే సమయంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. జగ్గారెడ్డి సమర్పించిన 3 క్వింటాళ్ల ముత్యాల తలంబ్రాలతో అంగరంగ వైభవంగా కళ్యాణ వేడుకలు జరిపించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలను మహేశ్వర సిద్ధాంతి చేతులమీదుగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ కళ్యాణ వేడుకలో జగ్గారెడ్డి తో పాటు ఆయన భార్య టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల, కూతురు జయ రెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయిరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సీతారాముల వారికి 2 కిలోల 250 గ్రాముల బంగారంతో కర్ణాభరనాలతో కూడిన కిరీటాలు, కంఠాభరణాలు, వడ్డానాలు, పద్మ పాదాలు, ధనస్సు, బాణం, యజ్ఞోపవేతం, నయనాలు , తిలకాలు, ముక్కు పోగు, శంకు చక్రాలు, అమ్మవారికి మంగళ సూత్రం , అమ్మవారికి కమల హస్తం, శ్రీ రాముల వారికి శరం తో కూడిన హస్తం తో పాటు 10 కిలోల వెండి తో ఆదిశేషుడు, వెండి కళ్యాణ పీటను జగ్గారెడ్డి సమర్పించారు. అంతకు ముందు తన ఇంట్లో ఆభరణాలకు పూజలు చేసి ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరి వచ్చారు.

డిజిటల్ సాన్నిహిత్యంపై

గీతం వర్సిటీలో ఆతిథ్య ఉపన్యాసం

- విద్యా పరిశోధనను విపులీకరించిన సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 27 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని ఆంగ్లం, ఇతర భారత విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ సాన్నిహిత్యం: అంతర్‌ఆసియాలో యువతులు అనే శీర్షిక శుక్రవారం ప్రత్యేక ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని గీతంలోని సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన అందించారు. ఆసియా నగరాలైన హాంగ్ కాంగ్, సింగపూర్, గ్వాంగ్ జౌ, బెంగళూరులలో ఆమె ఇటీవల జరిపిన బహుళప్రాంతీయ పరిశోధన ఆధారంగా, నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల సంస్కృతులచే రూపుదిద్దుకున్న డిజిటల్ మాధ్యమం, యువతులు తమ గుర్తింపు, సంబంధాలు, ఆత్మీయతను నిర్వహించుకునే విధానాలను ఎలా మారుస్తుందో ప్రొఫెసర్ నిరంజన అన్వేషించారు. ప్రజా, వ్యక్తిగత జీవితాల మధ్య సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ, డిజిటల్ మాధ్యమాల ద్వారా సామాజికత ఆవిర్భావం, రోజువారీ అనుభవంలో స్మార్ట్ ఫోన్ల పాత్ర కీలకంగా మారడం వంటి అంశాలను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ఉపన్యాసం భాషా పద్ధతులు, ఆన్‌లైన్‌ఆఫ్‌లైన్ సంబంధాలు, డిజిటల్ సన్నిహిత ప్రవర్తన యొక్క కొత్త రూపాలను కూడా పరిశీలించింది. సమకాలీన సందర్భాలలో భావప్రసార సరళి, ప్లాట్‌ఫారమ్ వినియోగం, ఎంపిక చేసుకున్న భాషా వాడకం అనేవి భావోద్వేగ వ్యక్తీకరణను, సామాజిక సంబంధాలను ఎలా పునర్నిర్మిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్లం, ఇతర భారత విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ వందన సమర్పణతో ముగిసింది. ప్రొఫెసర్ తేజస్విని నిరంజన గీతంలో డైరెక్టర్ గానే కాక, హాంకాంగ్ లోని లింగ్నాన్ విశ్వవిద్యాలయంలో అనుబంధ ప్రొఫెసర్. విశిష్ట పండితురాలైన ఆమె సంస్కృతి, సంగీతం, వలసానంతర అధ్యయనాలపై అనేక ప్రభావవంతమైన రచనలను చేయడమే గాక, సంపాదకత్వం వహించారు. ఆమె అమెరికన్ లిటరరీ ట్రాన్స్ లేటర్స్ అసోసియేషన్ వారిచే ఫిక్షన్ విభాగంలో జాతీయ అనువాద పురస్కారం పొందిన అవార్డు గ్రహీత, అనువాదకురాలు.

భారత జాతీయోద్యమ వీరుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివి

- భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ ల ఆశయాల సాధనకై యువకులు ముందుకు రావాలి
- స్వేచ్ఛ సమానత్వాన్ని సాధనకై పోరాడాలి
- పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 27: షహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం దగ్గర దేశ స్వతంత్రం కోసం ఉరి కొయ్యను ముద్దాడిన నిజమైన దేశభక్తులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, ఆస్ఫదుల్లకాన్ , అజాద్ చంద్రశేఖర్, ఉద్దమ్ సింగ్, భట్ కేశ్వర్ దత్ తదితరుల ఫోటో ప్రదర్శన ను ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయం నుండి భగత్ సింగ్ విగ్రహం వరకు PYL PDSU సంఘాల నాయకత్వం భగత్ సింగ్ అమరా హై, అమర వీరులు ఆశయాలను సాధిస్తాం అంటూ నినదిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. భారత దేశ విముక్తి కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూ నూనూగు మీసాల నవ యవ్వన వయస్సులో ఉరికొయ్యలకు వేలాడిన షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివని, వారి పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థి ,యువతకు స్ఫూర్తిదాయకమని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ అన్నారు. వీరితో పాటు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణ, జిల్లా కార్యదర్శి బీ రాము, ప్రముఖ న్యాయవాది కాళేశ్వర్, మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి సలీం సార్,knps నాయకులు చంద్రశేఖర్ లు షహీద్ భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిజమైన దేశభక్తులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవ్ ఆస్ఫదుల్లకాన్ అజాద్ చంద్రశేఖర్ ఉద్దమ్ సింగ్ భట్ కేశ్వర్ దత్ లు ఈ దేశం నుండి బ్రిటిష్ పాలకులు వదిలి వెళ్ళాలని నినాదించారు, ఉద్యమించారు. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడారు. సమానత్వపు సమాజాన్ని కాంక్షించారు. స్వేచ్ఛయుత స్వతంత్రం, అందరికీ సమాన హక్కులు కల్పించాలని పోరాటం చేశారు. సమస్త ప్రజానికాన్ని ఐక్యం చేసి స్వతంత్ర ఉద్యమంలో భాగస్వాములను చేశారు. అందుకని నేటి మతోన్మాద ఫాసిస్టు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా సంక్షేమ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. దానికి నేటి యువతం భారత స్వతంత్ర ఉద్యమ నాయకులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ఆస్ఫదుల్లకాన్ అజాద్ చంద్రశేఖర్ ఉద్దమ్ సింగ్ భట్ కేశ్వర్ దత్ ల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కాళేశ్వర్, చంద్రశేఖర్, సలీం ,రాము, భుట్టో, భాస్కర్, సాయి, సంధ్య, ప్రశాంత్, పాతపల్లీ సర్పంచ్ తెరప్పలు మాట్లాడారు. అరుణోదయ నాయకులు మాదారం గోపి , పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు, మల్లేష్, సలీం, జిల్లా నాయకులు బాలకృష్ణ, ఎల్లప్ప, కృష్ణ, శివ,గణేష్, గోపి, డి. గోపి, తరుణ్, బిజ్వార్ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మల్లేష్, కృష్ణయ్య, బాబు, చిన్నబాలు, అంజప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

ఒకవేళ ఇజ్రాయెల్ ఓటమి అంచున ఉంటే మేము యుద్ధంలోకి దిగుతాం. ఇరాన్‌పై దాడికి తమ బ్రిగేడ్ సరిపోతుంది. ఒకవేళ ఇరాన్ మాపై మిస్సైల్స్‌తో దాడి చేస్తే దీటుగా బదులిస్తాం. 1980, 1990ల్లో మా దేశం ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇజ్రాయెల్ తమకు అండగా నిలిచింది.

- ఉగాండా సైన్యాధ్యక్షుడు జనరల్ ముహూజీ

‘లాక్ డౌన్’ విధించే ప్రసక్తే లేదు

- స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 27: పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌లో లాక్‌డౌన్ విధించబోతున్నారనే వదంతులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కొట్టిపారేశారు. దేశంలో మళ్లీ లాక్‌డౌన్‌ను విధించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. ప్రజల్లో భయాందోళనలు పెంచేందుకు కొంతమంది బాధ్యతారాహిత్యంతో, ప్రమాదకర రీతిలో ఇలాంటి వదంతులను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వదంతుల్లో అస్సలు వాస్తవికత లేదన్నారు. లాక్‌డౌన్ అనే ప్రతిపాదనే భారత ప్రభుత్వం పరిశీలనలో లేదని నిర్మల, హర్దీప్ సింగ్ తేల్చి చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను యావత్ దేశం బాధ్యతాయుతంగా, ఐక్యంగా, క్రమశిక్షణతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

విశ్వ వీక్షణం

అన్నం, పప్పు, చపాతీ, ఇడ్లీ.. ఇలాంటివి రోజూ తిని బోర్ కొట్టేసిందా..? పైపెచ్చు వేసవికాలంలో అన్నం, పప్పు, పులుసు, మసాలా కూరలు తినాలనిపించదు. ఎక్కువగా ద్రవాహారాన్నే తీసుకోవాలనిపిస్తుంది. లైట్‌గా, తాజాగా, పోషకాలు అధికంగా ఉన్న ఉపాహారం తినాలనుకునేవారికి సలాడ్‌లను మించినవి లేవు. కొవ్వు తక్కువగా, పూర్తి పోషకాలతో నిండి ఉన్న ఈ సలాడ్లు చాలా రుచిగా ఉండటమే కాకుండా, మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయి. మరి అలాంటి సలాడ్లు ఏమిటో చూసేద్దామా..

లైట్ అండ్ హెల్దీ సలాడ్

సీఫుడ్‌తో..

కావలసిన పదార్థాలు

నత్తగుల్లలు	120 గ్రాములు
రొయ్యలు	150 గ్రాములు
కొమాటా సంచులు	100 గ్రాములు
ఆల్చిప్పలు	100 గ్రాములు
ఆలివ్‌నూనె	100 ఎం.ఎల్.
సోయాకూర	50 గ్రాములు
ఉప్పు	రుచికి సరిపడా
సన్‌డ్రైడ్ టొమాటోలు	75 గ్రాములు
నిమ్మరసం	75 ఎం.ఎల్.
మిరియాలపొడి	15 గ్రాములు

తయారుచేసే విధానం

రొయ్యలు, నత్తగుల్లలు, కొమాటాసంచులు, ఆల్చిప్పల్ని శుభ్రం చేయాలి. వీటన్నింటినీ ఓ పాత్రలో తీసుకుని ఆవిరిపై పన్నెండు నిముషాలు ఉడికించాలి. ఓ పాత్రలో ఆలివ్‌నూనెను తీసుకుని నిమ్మరసం కలిపి గిలక్కొటినట్లు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముందుగా ఉడికించి పెట్టుకున్న సీఫుడ్‌పై వేయాలి. తరువాత పైన సోయాకూర తరుగు, సన్‌డ్రైడ్ టొమాటోలు అన్నీ కలిపి సరిపడా ఉప్పు, మిరియాల పొడి చల్లితే చాలు.. సలాడ్ సిద్ధమైనట్లే.. దీన్ని చల్లగా తీసుకుంటే బాగుంటుంది.

మొలకలతో..

కావలసిన పదార్థాలు

పెసర మొలకలు	కప్పు
పచ్చిమామిడి ముక్కలు	అరకప్పు
దానిమ్మ గింజలు	అరకప్పు
కొత్తిమీర తరుగు	పావుకప్పు
ఉప్పు	తగినంత
కొబ్బరి తురుము	రెండు చెంచాలు
నూనె	చెంచా
ఆవాలు	అరచెంచా
ఇంగువ	చిటికెడు
పచ్చిమిర్చి తరుగు	అరచెంచా
కరివేపాకు	రెబ్బ

తయారుచేసే విధానం

ఒక గిన్నెలో పెసర మొలకలు, పచ్చిమామిడి కాయ ముక్కలు, దానిమ్మగింజలు, కొత్తిమీర తరుగు, కొబ్బరి తురుము తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఇప్పుడు బాణలిని స్టవ్‌పై ఉంచి నూనె వేయాలి. వేడయ్యాక ఆవాలు, ఇంగువ వేసి వేయించాలి. ఆవాలు వేగాక పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేసి దింపేయాలి. ఈ తాలింపును మొలకలపై వేసి ఓసారి కలపాలి. వడ్డించే ముందు ఉప్పు కలుపుకుంటే సరిపోతుంది. ఈ సలాడ్‌ను తినడం వల్ల మాంసకృత్తులు, డైటరీ పీచు, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పొందవచ్చు. కప్పు పెసర మొలకల నుంచి ఐదు గ్రాముల పిండిపదార్థాలు, మూడు గ్రాముల మాంసకృత్తులు అందుతాయి. ఇందులో కొవ్వు అసలు ఉండదు.

ఎగ్‌తో..

కావలసిన పదార్థాలు

గుడ్లు	నాలుగు
ఉడికించిన బంగాళాదుంపలు	రెండు
క్యారెట్	ఒకటి
ఆకుపచ్చ కాప్సికం	ఒకటి
టొమాటో	ఒకటి
ఉల్లిపాయ	ఒకటి
మిరియాలపొడి	చెంచా
చాట్‌మసాలా	అరచెంచా
ఉప్పు	తగినంత
కొత్తిమీర తరుగు	కొద్దిగా

తయారుచేసే విధానం

గుడ్లను నాలుగు ముక్కల్లా చేసుకోవాలి. ఒక గిన్నెలో కూరగాయ ముక్కలన్నింటినీ తీసుకుని బాగా కలపాలి. అందులో కోడిగుడ్డు ముక్కలతోపాటు చాట్‌మసాలా, మిరియాలపొడి, తగినంత ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి కలిపితే చాలు. అంతే సలాడ్ సిద్ధమైనట్లే.

చికెన్, ఆలివ్‌తో..

కావలసిన పదార్థాలు

సన్‌డ్రైడ్ టొమాటో	ఒకటిన్నర కప్పు
ఆరెగానో సలాడ్ డ్రెస్సింగ్	కొద్దిగా
ఎముకల్లేని చికెన్ ముక్కలు	నాలుగు
ఆలివ్‌నూనె	కొద్దిగా
ఎర్ర కాప్సికం	రెండు
లెట్యూస్ ఆకులు	పెద్దవి రెండు
ఆలివ్‌లు	కప్పు
ఫెటాచీజ్ ముక్కలు	కొన్ని
ఉల్లిపాయ ముక్కలు	అరకప్పు
వెల్లుల్లి ముక్కలు	రెండు చెంచాలు
మిరియాల పొడి	చెంచా
కొరిజో సాసేజ్	పావుకప్పు

తయారుచేసే విధానం

బాణలిలో కొద్దిగా ఆలివ్‌నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి పలుకులు వేసి వేయించాలి. పది నిముషాలు అయ్యాక ఎర్ర కాప్సికం ముక్కలు చేర్చాలి. బాగా కలిపాక సన్ డ్రైడ్ టొమాటో ముక్కలు, కొరిజో సాసేజ్, మిరియాల పొడి వేసి బాగా కలిపి మంట తగ్గించాలి. ఐదారు నిముషాలు అయ్యాక చికెన్ ముక్కలు, సలాడ్ డ్రెస్సింగ్ కలిపి ఇరవై నిముషాల నుంచి అరగంటపాటు స్టవ్‌పై ఉంచాలి. చికెన్ ముక్కలు బాగా మెత్తగా అయ్యాక దింపేసి చల్లారనిచ్చి ఫ్రిజ్‌లో ఉంచాలి. వడ్డించే ముందు ఆలివ్‌లు, చీజ్ అలంకరించాలి. దీన్ని లెట్యూస్ ఆకులతో కలిపి వడ్డించాలి. ఇది బ్రెడ్డుతో పాటు కలిపి తిన్నా చాలా బాగుంటుంది.

సెనగలతో..

కావలసిన పదార్థాలు:

ఎరుపు కాప్సికం	సగం
పసుపు కాప్సికం	సగం
ఆకుపచ్చ కాప్సికం	సగం
ఉల్లికాడల తరుగు	పావుకప్పు
ముందురోజు నానబెట్టి ఉడికించిన సెనగలు:	అరకప్పు
మామిడికాయ	సగం
దానిమ్మగింజలు	అరకప్పు
కొత్తిమీర తరుగు	పావుకప్పు
పచ్చిమిర్చి ముక్కలు	చెంచా
చాట్‌మసా	అరచెంచా
ఉప్పు	తగినంత

తయారుచేసే విధానం

ముందుగా కూరగాయ ముక్కలన్నింటినీ సన్నగా తరిగి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఉడికించిన సెనగలు, కొత్తిమీర తరుగు, దానిమ్మగింజలు, పచ్చిమిర్చి ముక్కలు, చాట్‌మసాలా, ఉప్పు వేసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఇందులో మాంసకృత్తులు, సి విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు ఉంటాయి. అరకప్పు సెనగలు తీసుకోవడం వల్ల 27 గ్రాముల పిండిపదార్థాలు, 2 గ్రాముల కొవ్వు, 6 గ్రాముల మాంసకృత్తులు అందుతాయి.

జాతీయ రహదారిపై విరిగిపడిన మంచు కొండలు

- ఏడుగురు మృతి.. ఆరుగురికి గాయాలు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ - లేహ్ మార్గంలో హిమపాతం విధ్వంసం సృష్టించింది. మంచు కొండలు విరిగి పడిన ఘటనలో ఏడుగురు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. పన్నెండకు పైగా కార్లు మంచులో కూరుకుపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం జీరో పాయింట్, మినిమార్గ్ మధ్య ప్రాంతంలో మంచు చరియలు ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి దూసుకొచ్చాయని అధికారులు తెలిపారు. శ్రీనగర్ - లేహ్ మార్గంలో హిమపాతం ప్రమాదం గురించి తెలిసిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి.. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని అధికారులు వెల్లడించారు. లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా తాను సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నానని ఎక్స్ వేదికగా తెలిపారు. ‘జోజిలా మార్గంలో మంచు కొండలు విరిగిపడ్డాయనే దురదృష్టకరమైన వార్త విన్నాను. వెంటనే కార్గిల్ జిల్లా కలెక్టర్, ఎస్ఎస్‌పీలను ఘటనా స్థలానికి వెళ్లి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించాను. అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు, విపత్తు నిర్వహణ దళాలు, సరిహద్దు రోడ్డు సంస్థ (బీఆర్‌వో)లు అప్రమత్తమయ్యాయి. నేను వ్యక్తిగతంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నాను’ అని వీకే సక్సేనా చెప్పారు.

2.38 లక్షల కోట్లతో యుద్ధ విమానాల కొనుగోలు

- అనుమతి ఇచ్చిన రక్షణ శాఖ

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: భారతదేశం రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకొనే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా సైనిక అవసరాల కోసం భారీగా యుద్ధ విమానాల కొనుగోలుకు డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ.2.38 లక్షల కోట్లతో యుద్ధ విమానాలను కొనేందుకు రక్షణ శాఖకు అనుమతి లభించింది. ఈ విషయాన్ని శుక్రవారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆధునిక కాలానికి తగ్గట్టుగా భారత దేశ సైనిక శక్తిని, తెగువను దుర్భేద్యంగా మార్చుకునే దిశగా మరో అడుగు పడింది. డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ శుక్రవారం రూ.2.38 లక్షల కోట్ల యుద్ధ విమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త విమానాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదన (యాక్సెప్టెన్స్ ఆఫ్ నెస్సెసిటీ)కు డీఏసీ అంగీకరించింది. దాంతో, సైన్యం, వాయుసేన, కోస్ట్ గార్డ్ విభాగానికి అవసరమైన యుద్ధ విమానాలను కొనే ప్రక్రియ వేగవంతం కానుంది. ‘ఈరోజు డీఏసీ సమావేశానికి అధ్యక్షత వహించాను. ఈ సందర్భంగా సైన్యం అవసరాల నిమిత్తం రూ.2.38 లక్షల కోట్లతో యుద్ధ విమానాల కొనుగోలుకు అమోదం లభించింది. డీఏసీలో తీసుకున్న ఈ నిర్ణయం భారత దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయనుంది. భారత సైన్యంకోసం ఎయిర్ డిఫెన్స్ ట్రాక్డ్ సిస్టమ్, ఆర్మోర్డ్ పియెర్సింగ్ ట్యాంక్ అమ్మునిషన్, అత్యధిక సామర్థ్యం కలిగిన రేడియో రీలే, ధనుష్ గన్ వ్యవస్థ, స్వతంత్ర నిఘా వ్యవస్థతో కూడిన రన్‌వే.. వంటి వాటికి డీఏసీలో ఆమోదం లభించింది’ అని రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ పోస్ట్‌లో పోస్ట్ చేశారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రక్షణ శాఖకు సంబంధించిన ఆమోదాలు, ఒప్పందాలు రికార్డు స్థాయికి చేరాయని ఆయన తెలిపారు. ఇప్పటివరకూ రూ.6.73 లక్షల కోట్ల ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు. భారత సైన్యం ప్రస్తుతం ఉపయోగిస్తున్న పాతకాలపు ఏఎన్32, ఏఎల్76 యుద్ధ విమానాల స్థానంలో మధ్య తరహా రవాణా యుద్ధ విమనాలు రాబోతున్నాయి. గగనతల మిసైల్ వ్యవస్థ పటిష్టం కోసం రష్యాకు చెందిన ఎస్400 విమానాలు కొనేందుకు డీఏసీ ఓకే చెప్పింది. వీటి సాయంతో అధునాతన గగనతల దాడుల ముప్పును సమర్థంగా ఎదుర్కోవడం, సంక్లిష్టమైన లక్ష్యాలను ఛేదించడం సాధ్యపడనుంది.

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ భారీగా తగ్గింపు

- ధరలు మాత్రం తగ్గవు.. ప్రయోజనం ఆయిల్ కంపెనీలకే

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ.3 తగ్గించగా.. డీజిల్‌పై పూర్తిగా (జీరో) రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఇప్పటివరకు పెట్రోల్‌పై లీటర్‌కు రూ.13, డీజిల్‌పై రూ.10 వరకు ఎక్సైజ్ సుంకం కేంద్రం వసూలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించినప్పటికీ వినియోగదారులకు వెంటనే ఉపశమనం లభించే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి దాదాపు మూతబడటంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు కూడా పెరిగాయి. ఇప్పుడు తగ్గించిన ఎక్సైజ్ డ్యూటీని.. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తమ నష్టాన్ని తగ్గించుకోవడానికి వినియోగించే అవకాశం ఉంది. దీనివల్ల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరకపోయినప్పటికీ.. భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా ఈ నిర్ణయం కొంతవరకు ఉపయోగపడే అవకాశం ఉంది.

నేటి నుంచి ఐపీఎల్

- హైదరాబాద్, బెంగళూరు మధ్య తొలి పోరు

అభిమానులు ఎదురుచూస్తున్న క్రికెట్ పండుగ రానే వచ్చింది. 18 సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకుని 19వ సీజన్‌లోకి అడుగుపెడుతున్న ఐపీఎల్..ఈసారి మరింత జోష్‌ను అందించడం ఖాయంగా కనిపిస్తున్నది. పొట్టి ప్రపంచకప్‌తో కోట్లాది మంది అభిమానుల కల నెరవేరిన వేళ ఐపీఎల్ రెట్టింపు క్రేజ్ తో దుమ్మురేపే అవకాశముంది. శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) జట్ల మధ్య పోరుతో ఐపీఎల్‌కు అధికారికంగా తెరలేవనుంది. గతానికి భిన్నంగా ఈసారి ఎలాంటి ఆరంభ వేడుకలు లేకుండానే ఐపీఎల్ సాదాసీదాగా మొదలుకానుంది. గతేడాది తొక్కిసలాటలో మరణించిన 11 మందికి నివాళిగా ఈసారి ప్రారంభ కార్యక్రమాన్ని మినహాయించారు. వారికి మద్దతుగా నిలిచేందుకు స్టేడియంలో 11 సీట్లను మృతుల కుటుంబాలకు కేటాయించారు. దీనికి తోడు మ్యాచ్ రోజు ఆర్‌సీబీ ప్లేయర్లంతా 11 నంబర్ జెర్సీ ధరించి ప్రాక్టీస్‌లో పాల్గొననున్నారు. 18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిరుడు ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడిన ఆర్‌సీబీ మరోమారు అదే ఫీట్‌ను పునరావృతం చేయాలని చూస్తున్నది. పరుగుల వరద పారే అవకాశమున్న చిన్నస్వామిలో సన్‌రైజర్స్‌ను తొలి పోరులో ఎలా ఎదుర్కొవాలనే దానిపై దృష్టి పెట్టింది. స్టార్ బౌలర్ల గైర్హాజరీలో ఇరు జట్లు ఒకింత బలహీనంగా కనిపిస్తున్నా..బ్యాటింగ్ పరంగా చాలా బలంగా ఉన్నాయి. చిన్నస్వామి ఫ్లాట్ వికెట్‌పై ఈసారి 300 మార్క్ టచ్ అవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓవైపు ఇషాన్ కిషన్, అభిషేక్‌శర్మ, హెడ్, క్లాసెన్‌తో హైదరాబాద్ దుర్భేద్యంగా కనిపిస్తుంటే..కోహ్లీ, డేవిడ్, సాల్ట్, బెతెల్, రజత్, షెఫర్డ్‌తో ఆర్‌సీబీ అంతే పటిష్టంగా ఉంది.



టీమిండియాలోకి వైభవ్ సూర్యవంశీ

క్రికెట్ ప్రపంచంలో తారాజువ్వ మాదిరిగా వచ్చిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం భారత క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. కేవలం 14 ఏళ్ల 23 రోజుల వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించాడు. తన తొలి మ్యాచ్‌లోనే శార్దూల్ ఠాకూర్ వేసిన మొదటి బంతిని సిక్సర్‌గా మలచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అంతటితో ఆగకుండా, కేవలం మూడో మ్యాచ్‌లోనే గుజరాత్ టైటాన్స్ పై 35 బంతుల్లో సెంచరీ సాధించి, యూసుఫ్ పఠాన్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు.ఐపీఎల్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ వైభవ్ తన సత్తా చాటాడు. ఇటీవల జరిగిన అండర్19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లాండ్‌పై కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు (15 సిక్సర్లు, 15 ఫోర్లు) చేసి భారత్‌కు టైటిల్ అందించాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లోనూ అతని ప్రదర్శన నిలకడగా ఉండటం విశేషం.అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల ప్రకారం అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు కనీస వయసు 15 సంవత్సరాలు. మార్చి 27, 2026 నాటికి వైభవ్ 15వ ఏట అడుగు పెట్టడంతో, అధికారికంగా టీమిండియా సీనియర్ జట్టుకు ఎంపికయ్యే అర్హత సాధించాడు. గతంలో పాకిస్థాన్‌కు చెందిన హసన్ రజా అతి చిన్న వయసులో టెస్ట్ క్రికెట్ ఆడిన రికార్డు ఉంది. ఇప్పుడు వైభవ్ కూడా అదే దారిలో ముందుకు సాగుతున్నాడు. త్వరలోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలతో కలిసి ఆడే అవకాశం ఈ యువ సంచలనానికి దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బిజీగా ఉన్న అతడు, మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగే మ్యాచ్‌లో మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఇక భవిష్యత్తుపై చూస్తే, 2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా సెలెక్టర్లు వైభవ్‌ను కూడా పరిశీలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతని ప్రస్తుత ఫామ్, ఆత్మవిశ్వాసం చూస్తుంటే, బీసీసీఐకి ఇది తీపి తలనొప్పిగా మారే అవకాశముంది. మొత్తానికి, చిన్న వయసులోనే భారీ రికార్డులు సృష్టిస్తూ ముందుకు దూసుకెళ్తున్న వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్‌కు మరో సూపర్ స్టార్‌గా మారడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ధోనీ ఇంకా పదేళ్లు ఆడాలి

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌లో మరో 10 ఏళ్లు కొనసాగాలని మాజీ క్రికెటర్ యోగ్ రాజ్ సింగ్ అన్నాడు. ధోనీ ఫిట్‌గా ఉన్నాడని, రిటైర్ కావాలని అతనికి ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డాడు. 6 ఏళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ.. కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రతీ ఐపీఎల్ సీజన్‌కు ముందు ధోనీ రిటైర్మెంట్‌పై వార్తలు వస్తున్నాయి. 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ సీజన్ అని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ సీజన్‌లో ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా కొనసాగాలని కొందరంటే.. రెగ్యులర్ ప్లేయర్‌గా ఆడాలని మరికొందరు అన్నారు. ధోనీ రిటైర్మెంట్ ప్రకటించి యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని కూడా కొంతమంది సూచించారు. తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగ్ రాజ్ సింగ్.. ధోనీకి మద్దతుగా మాట్లాడాడు. తన కొడుకు యువరాజ్ సింగ్ కెరీర్ త్వరగా ముగియడానికి ధోనీనే కారణమని యోగ్ రాజ్ సింగ్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇలా అవకాశం దొరికినప్పుడుల్లా ధోనీపై విమర్శలు గుప్పించే యోగ్‌రాజ్ సింగ్ తొలిసారి అతని గురించి సానుకూలంగా మాట్లాడాడు. 'ధోనీ ఇంకా ఆడుతున్నాడు. మరో 10 ఏళ్ల వరకు అతను ఆడాలి. ఎందుకంటే సరైన క్రమశిక్షణ, అంకితభావంతో తన ఫిట్‌నెస్‌ను అతను నిరూపించుకున్నాడు. అతని మోచేతి చూస్తుంటే ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. అతనో అద్భుతమైన వ్యక్తి. అతను రిటైర్ అవ్వాలని చెప్పడానికి అసలు వేరే వాళ్లు ఎవరు? క్రికెట్ పరంగా అతనికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.'అని యోగ్ రాజ్ సింగ్ చెప్పుకొచ్చాడు.



తొలి మ్యాచ్ కు సన్‌రైజర్స్ జట్టు ఇదే

పీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్‌కు సిద్ధమైంది. శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో ఆరెంజ్ ఆర్మీ అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటికే సన్నాహకాలను పూర్తి చేసుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గత సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబర్చి ఆరో స్థానంతో సరిపెట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఈ సారి మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో ఆరెంజ్ ఆర్మీకి తిరుగు లేకున్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. ప్యాట్ కమిన్స్, ఇషాన్ మలింగా గాయాలతో ఇబ్బంది పడుతుండటం సన్‌రైజర్స్ సమస్యలను రెట్టింపు చేసింది. కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టును నడిపించనున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ విజయంతో పాటు టీ20 ప్రపంచ కప్ గెలుపుతో రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఇషాన్ బరిలోకి దిగుతున్నాడు. అభిషేక్, ట్రావిస్ హెడ్, క్లాసెన్ బ్యాట్ ఝులిపించడంతో పాటు బౌలింగ్ బలహీనతలను అధిగమిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తిరుగుండదు.

జట్టు అంచనా: ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(కెప్టెన్), హెన్రీచ్ క్లాసెన్, సలీల్ అరోరా/అనికేత్ వర్మ, లియామ్ లివింగ్ స్టోన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్, హర్ష్ దూబే, బ్రైడన్ కార్స్, జయదేవ్ ఉనాద్కత్

ఇంపాక్ట్ సబ్: శివమ్ మావి/ప్రఫుల్ హింగే/శివాంగ్ కుమార్

ప్రతిపక్షం
Prathipaksham.in
12
హైదరాబాద్
శనివారం
28.03.2026

సినిమా

ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి సందర్భంగా

'రామ' గ్లింప్స్

2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో 'రామాయణం' ఒకటి. ఇది ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా రూపుదిద్దుకుంటోంది. నితేష్ తివారీ దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా నిర్మాణంలో రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ ఇతిహాసం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ ట్యాలెంటెని ఒకచోట చేర్చి, ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికను సిద్ధం చేస్తోంది. ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, మార్చి 27న జరుపుకున్న పవిత్రమైన 'రామ నవమి' సందర్భంగా, నిర్మాత నమిత్ మల్హోత్రా తన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. 'రామాయణం' నిర్మాణ ప్రయాణం వెనుక ఉన్న తన వ్యక్తిగత భావాలను పంచుకుంటూనే, ఒక కీలకమైన తాజా సమాచారాన్ని రివీల్ చేశారు

పెద్ది పహిల్వాన్

రామ్ చరణ్ బర్త్ డే స్పెషల్ గ్లింప్స్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ శుక్రవారం తన పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'పెద్ది' మేకర్స్ బర్త్ డే, శ్రీరామ నవమిని పురస్కరించుకుని అభిమానులకు ఒక పవర్‌ఫుల్ కానుకను అందించారు. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో రూపొందుతున్న 'పెద్ది' పెహల్వాన్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'కుస్తీ అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లే ఆట' అనే పవర్ ఫుల్ వాయిస్ తో గ్లింప్స్ మొదలౌతుంది. ఆ తర్వాత విజువల్స్ ఆడియన్స్ ని కుస్తీ పోటీలోకి తీసుకువెళ్తాయి. అక్కడ దుమ్ము, చెమట, సంకల్ప బలం ప్రతి ఫ్రేమ్‌లోనూ కట్టిపడేశాయి. కఠినమైన శిక్షణను తట్టుకుంటూ, ఇటుక గోడలను ఎక్కుతూ, ఇసుక సంచులను ఎత్తుతూ, అచంచలమైన సంకల్పంతో గదలో ప్రావీణ్యం సంపాదిస్తున్న పెద్ది పహిల్వాన్ ఎదుగుదల అద్భుతంగా వుంది. రామ్ చరణ్ ట్రాన్స్ ఫర్మేషన్ మెస్మరైజింగ్ గా ఉంది. సిక్స్-ప్యాక్ అబ్స్, దృఢమైన కండరాలు, ఇంటెన్స్ ప్రజెన్స్ తో నిజమైన పహిల్వాన్‌గా ఒదిగిపోయారు. రామ్ చరణ్ గదను పట్టుకొని హనుమంతుడిలా కనిపించిన సన్నివేశం అద్భుతం, శ్రీరామ నవమి ఆధ్యాత్మిక ఉత్సాహానికి సరిగ్గా సరిపోయేలా వుంది. "చూడుమే... ఆటే నా పొగరు..."అని చరణ్ పలికిన ఫైనల్ డైలాగ్ అదిరిపోయింది. దర్శకుడు బుచ్చి బాబు సానా, రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అవతార్‌లో చూపిస్తూ, గూస్ బంప్స్ ట్రీట్ ని అందించారు.

ఏప్రిల్ 17న వస్తున్న 'బ్యాడ్ బాయ్ కార్తిక్'

హీరో నాగ శౌర్య అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తిక్'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మాణంలో, నూతన దర్శకుడు రామ్ దేశిన (రమేష్) దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ ఇప్పటికే భారీ బజ్‌ను సృష్టించాయి. విడుదలైన ప్రతి పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. హైవోల్టేజ్ సన్నివేశాలు మాస్ యాటిట్యూడ్‌తో నిండిన ఈ సినిమా టీజర్, చిత్రంపై ఉన్న అంచనాలను మరింత పెంచింది. రిలీజ్ డేట్ పోస్టర్ లో ఫైర్ బ్యాక్ డ్రాప్, ఒక చేతిలో ఆయుధం పట్టుకుని, మరో పిడికిలి బిగించి నాగ శౌర్య కనిపించడం, ఆయన వెనుక, పండుగ ఊరేగింపులలో కనిపించే భారీ అమ్మవారి విగ్రహం దర్శనమివ్వడం క్యూరియాసిటీని పెంచింది. 'బ్యాడ్ బాయ్ కార్తిక్' సినిమా థియేట్రికల్, నాన్‌థియేట్రికల్ హక్కులనుజీ స్టూడియోస్ భారీ ధరకు సొంతం చేసుకుంది.



'శ్రీమహా విష్ణు' రొమాంటిక్ ఫస్ట్ లుక్

సిద్ధార్థ్ రాయ్' చిత్రంలో హీరోగా అరంగేట్రం చేసి ఆకట్టుకున్న బాలనటుడు, హీరో దీపక్ సరోజ్, ఇప్పుడు హరి హరన్ గోధగాని దర్శకత్వంలో తన రెండవ చిత్రానికి సిద్ధమవుతున్నాడు. శ్రీ లక్ష్మీ నరసింహ ఆర్ట్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 1గా శ్రీ హరి తన్నీరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో దీపక్ సరోజ్ సరసన అనైరా గుప్తా, దీప్సిక నటిస్తున్నారు. పవిత్రమైన శ్రీరామ నవమి సందర్భంగా, చిత్ర బృందం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'శ్రీమహా విష్ణు' అనే టైటిల్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ ఫస్ట్ లుక్, హీరో హీరోయిన్ మధ్య ఒక లవ్లీ మూమెంట్ ని ప్రజెంట్ చేస్తోంది. సున్నితమైన ఆయిల్ పెయింటింగ్ స్టయిల్ లో అందంగా డిజైన్ చేసిన ఈ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. 'ప్రతి హృదయానికీ ఒక కథ ఉంటుంది' అనే ట్యాగ్‌లైన్ ఒక సున్నితమైన ప్రేమకథ ఉందని సూచిస్తుంది. 'శ్రీమహా విష్ణు' ప్రేమ, బాధ్యత, ఆత్మశోధన వంటి అంశాలను ప్రజెంట్ చేసే ఒక మంచి ప్రేమకథగా రూపొందించబడింది. దీపక్ సరోజ్ ఒక యువ చిత్రకారుడి పాత్రను పోషిస్తున్నాడు, ఈ పాత్ర ఎమోషనల్ డెప్త్‌తో సరికొత్తగా ఉండబోతుంది. అత్యున్నత నిర్మాణ, సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడిన ఈ చిత్రం షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుంది, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200